ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల
జిల్లా వార్తలు
మంగళవారం 3 జూన్ 2025

వైసీపీ ఐదేళ్ల పాలనలో అవినీతిపరులు రెచ్చిపోయారు. ప్రభుత్వం కార్యాలయాల్లో అయితే ఫైసలివ్వనిదే ఫైళ్లు కదలని పరిస్థితులు ఉండేవి. ఏసీబీ అధికారులకు సైతం బెదరని పరిస్థితుల్లో లంచావతారులు ఉన్నారంటే అప్పటి పరిస్థితులు ఎలాగున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఏసీబీ చేపడుతున్న అరకొర దాడులు వారి మార్పు తీసుకురావడం లేదు.ఆయా శాఖల్లో పనిచేసే కొందరు అధికారులు, సిబ్బంది విచ్చలవిడిగా దోచుకుంటున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెడుతున్నారనే విమర్శలున్నాయి. అవినీతిలో మునిగితేలుతున్న అధికారులు చట్టానికి చిక్కకుండా వివిధ రూపా(కొత్తవిధానాల)ల్లో లంచాలు పొందుతున్నారు. ఏసీబీ అధికారులు తమ దృష్టికి వచ్చినా ఫిర్యాదులపైనే స్పందిస్తారనే ప్రచారం ఉంది. బాధితులు వెళ్లి వారిని సంప్రదిస్తేనే వస్తారని.. లేకుంటే ఉదాసీనంగా వ్యవహరించి గాలికి వదిలేస్తారనే అభిప్రాయం లేకపోలేదు.



ఉద్యోగుల్లో అవినీతి చెదలు

- ఏసీబీకి జంకని అక్రమార్కులు
- ప్రభుత్వ కార్యాలయాల్లో రాజ్యమేల్లుతున్న అవినీతి
- ఫైసలివ్వనిదే కదలని ఫైళ్లు
- బాధితుల నుంచి ముక్కుపిండి వసూళ్లు..
- అరకొర దాడులతో అడ్డుకట్టపడేనా?
- తాజా దాడులతో ఉద్యోగుల్లో అలజడి
- కొత్త విధానాలతో రెచ్చిపోతున్న అవినీతిపరులు



నంద్యాలలో వివరాలను వెల్లడిస్తున్న ఏసీబీ అధికారులు (ఫైల్)

నంద్యాల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని కొందరు ప్రభుత్వ ఉద్యోగులు లంచావతారులు ఏసీబీకి కూడా జంకని(బెదరని) పరిస్థితులు నెలకొన్నాయి. కర్నూలు, నంద్యాల జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి రాజ్యమేలుతోంది. ఎక్కడికక్కడ ఆయా శాఖల్లో కొందరు అధికారులు అందిన కాటికి దోచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. బాధితులు పలువిధాలుగా నష్టపోతున్నారు. ఏపనికోసం వచ్చినా.. ఫైసలివ్వందే ఫైలు కదలడంలేదు. బాధితుల నుంచి ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. చివరికి ఏసీబీ(అవినీతి నిరోధకశాఖ) దాడులు చేస్తున్నా.. అవినీతి అధికారుల్లో ఏమాత్రం మార్పు రావడం లేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అయితే మరీ దారుణం. ఏసీబీ అధికారులు అరకొర దాడులతో మమ అనిపించారు. ఇదే అదునుగా భావించి సదరు అవినీతి అక్రమార్కులు మరింత బరితెగించారు. మొత్తంగా ఏసీబీ అరకొర దాడుల పరిస్థితికి భిన్నంగా మారుతున్నాయి.

- మే నెల 16వ తేదిన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ ఏడీఈగా పనిచేస్తున్న రవికాంత్‌చౌదరి తరఫున ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రతాప్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం రైతు నుంచి రూ.30వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సదరు ఏడీఈతో పాటు ఔసోర్సింగ్ ఉద్యోగిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రవికాంత్‌చౌదరి నుంచి విలువైన పత్రాలు, ఎల్‌ఐసీ బాండ్లు, ఎఫ్‌డీలతో పాటు రూ. 2.85కోట్లు విలువ చేసే 41రకాలు బంగారు ఆభరణాలు స్వాదీనం చేసుకున్నారు.
- కర్నూలులో మున్సిపల్ సీనియర్ ఇంజనీర్ సురేంద్రబాబు 2022 జూన్ 31న నగరంలోని క్రిష్ణానగర్ ఫ్లైఓవర్ కింద ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.15లక్షలు లంచం తీసుకుంటూ అప్పటి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. 'అమృత్'కి చెందిన ఫైనల్ బిల్లు విషయంలో సదరు అధికారి లంచం తీసుకున్నట్లు తెలిసింది.
- కర్నూలు జిల్లా వెల్దుర్తి పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్ఐ ఖాదర్‌వలి 2022లో మే22న ఓ కేసులోని నిందితుడిని రిమాండ్‌కు తరలించకుండా ఉండేందుకు సదరు నిందితుడి నుంచి రూ.40వేలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. అప్పటి సీఐ సదరు నగదు తీసుకోమని చెబితే తీసుకున్నట్లు ఆఏఎస్ఐ ఏసీబీ అధికారులకు వివరించారు. సదరు సీఐ, ఏఎస్ఐపై కేసు నమోదుచేసి ఇద్దరిని సస్పెండ్ చేశారు.
- నంద్యాల మైన్స్ అండ్ జియాలజీ శాఖలో అసిస్టెంట్ జియాలజిస్ట్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావుపై ఆదాయానికి మించిన ఆస్తుల నేపథ్యంలో 2023లో సదరు ఉద్యోగి ఇంటిలో ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. రూ.50 కోట్లకు పైగా విలువైన ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు.
- నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం మిడుతూరు మండలంలోని జలకనూరు గ్రామానికి చెందిన వీఆర్వో వెంకట రమణారెడ్డి 2023లో ఓరైతుకు చెందిన భూమిని ఆన్‌లైన్ చేయడానికి రూ.30 వేలు డిమాండ్ చేశారు.

మిగతా 6లో...

ఆలిండియా స్థాయిలో

సత్తా చాటారు..!

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లా వాసులకు మెరుగైన ర్యాంకులు



తల్లిదండ్రులతో చెన్నకేశవ



తల్లిదండ్రులతో అభిరామ్ రెడ్డి

పత్తికొండ/ కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ-అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో కర్నూలు జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. దేశవ్యాప్తంగా విడుదలైన ఫలితాల్లో మెరుగైన ర్యాంకులు సాధించారు.పత్తికొండకు చెందిన ఇద్దరు విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. పత్తికొండకు చెందిన రమేశ్, కళ్యాణి కుమారుడు కప్పట్రాళ్ల చెన్నకేశవ 199వ ర్యాంకు సాధించాడు. అలాగే రంగారెడ్డి, మాధవీలత కుమారుడు అబిరామ్‌రెడ్డి 860వ ర్యాంకు సాధించాడు. చెన్నకేశవ హైదరాబాదు శ్రీచైతన్యతో ఇంటర్ పూర్తిచేసుకొని అక్కడే మెయిన్స్ పరీక్షలు రాశాడు. అలాగే అభిరామ్‌రెడ్డి హైదరాబాదు నారాయణ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసి అక్కడ నుంచే మెయిన్స్ పరీక్షలు రాశాడు. ఈ సందర్భంగా చెన్నకేశవ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే ఉత్తమ ర్యాంకు సాధించానన్నారు. మరో విద్యార్థి అభిరామ్ రెడ్డి మాట్లాడుతూ అహర్నిశలు కష్టపడి చదివి, ఉపాధ్యాయుల సూచనలు, తల్లిదండ్రుల ప్రేరణతో ఆలిండియా స్థాయిలో 860వ ర్యాంకు సాధించానని తెలిపారు. బీటెక్‌లో ఉన్నత ఫలితాలు సాధించి మంచి కంపెనీలో ఉద్యోగం సాధిస్తానని దీమా వ్యక్తం చేశారు.



కే. జీవన్ కుమార్



టి.మిధున్ సాయి కుమార్

అదేవిధంగా కర్నూలు నగరం వెంకటరమణ కాలనీకి చెందిన కె.జీవన్ కుమార్‌కు ఆలిండియా స్థాయిలో 889వ ర్యాంకు, టి. మిధున్ సాయి కుమార్‌కు 6015వ ర్యాంకు వచ్చాయి. ఎస్టీ కేటగిరిలో వినుకొండ నవదీప్ 646వ ర్యాంకు సాధించి అగ్రభాగంలో నిలిచారు. ఈ సందర్భంగా టి.మిధున్‌సాయి కుమార్ మాట్లాడుతూ ప్రముఖ జాతీయ విద్యాసంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీలో బీటెక్ కోర్సుల్లో సీఎస్ఈ సైన్స్ కంప్యూటర్ ఇంజనీరింగ్ చేయాలన్నదే తన లక్ష్యం అన్నారు.

● పేదింట్లో మెరిసిన ముత్యం నవదీప్



నవదీప్

సాధారణ కుటుంబంలో పుట్టిన నవదీప్ జేఈఈ-మెయిన్స్‌లో అసాధారణ ఫలితాలు సాధించాడు. కర్నూ లు జిల్లా చిన్నటేకూరు ఐఐటీ మెడికల్ అకాడమిలో ఇంటర్ ఎంపీసీ గ్రూపులో పూర్తి చేశాడు. ఇంటర్ ఫలితాల్లో 938 మార్కులు సాధించాడు. జేఈఈ-మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో 79.89 పర్సంటేజీతో జేఈఈ-అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఎస్టీ కేటగిరిలో ఆలిండియా స్థాయిలో 646వ ర్యాంకు సాధించాడు. ఐఐటీ-బాంబే, మద్రాసుల్లో ఎస్‌సీఈ బీటెక్ బ్రాంచులో చేరాలన్నదే తన కోరిక అన్నాడు. నవదీప్ సొంత గ్రామం కృష్ణా జిల్లా, నందిగామ, పామూరు హై స్కూల్ వరకు చదివి పదో తరగతిలో 531 మార్కులు సాధించాడు. చిన్నటేకూరు ఐఐటీ మెడికల్ అకాడమిలో ఇంటర్ ఎంపీసీలో చదివి 938 మార్కులు సాధించాడు. అతని తల్లి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. తండ్రి చిన్నప్పుడే చనిపోయారు.

ప్రదీప్ ప్రతిభ



ప్రదీప్(ఫైల్)

దొర్నిపాడు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన తిరుపెంగాళ్ల ప్రదీప్ జేఈఈ ఫలితాల్లో 2,949 ర్యాంకు సాధించారు. ప్రదీప్ తల్లిదండ్రులు రామ ఓబులేసు, లక్ష్మీప్రసన్న కూలీ పనులు చేసుకుంటూ కొడుకును చదివిస్తున్నారు. పదో తరగతి వరకు సున్నిపెంటలోని ఎంజేపీఏపీ బీసీ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివి 537మార్కులు సాధించాడు. నంద్యాల న్యూక్లియస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీలో 959 మార్కులు సాధించాడు. మొదటి సారే జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. కుమారుడు జేఈఈ ఫలితాల్లో జాతీయ స్థాయిలో రాణించడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తంచేశారు.

బాధితులకు న్యాయం చేయాలి: ఎస్పీ



ఆర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ

నంద్యాల టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అర్జీలను పూర్తిస్థాయిలో విచారించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సూచించారు. నంద్యాలలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ 105 అర్జీలు వచ్చాయని తెలిపారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అధికారులకు కూడా ప్రజల పట్ల మంచి ప్రవర్తన కల్గి ఉండాలని కోరారు. సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు, పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గెలవడానికే అబద్ధాల హామీలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

నంద్యాల రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో గెలవడానికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అబద్ధాల హామీలు ఇచ్చారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. సోమవారం నంద్యాల తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో పేదలకు ఇంటి స్థలాలు కోరుతూ దరఖాస్తుదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారిని గుర్తించి పట్టణాలలో 2 సెంట్లు, గ్రామాలలో మూడు సెంట్లు స్థలాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణాలకు రూ. ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే నిరుద్యోగులకు ప్రతి నెల రూ మూడు వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ప్రియదర్శినికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సుంకన్న, సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సంగమేశ్వరం వద్ద పుష్కర ఘాట్‌ను తాకి ప్రవహిస్తున్న వరద

సంగమేశ్వరంలో పోటెత్తిన వరద

● మరో 8 అడుగులు పెరిగితే గర్భాలయంలోకి

కొత్తపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో గత 5 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దిగువనున్న శ్రీశైలం రిజర్వాయర్‌కు వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో సంగమేశ్వరం ఆలయ సమీపంలోని పుష్కరఘాట్లకు వరదజలాలు తాకాయి. దీంతో సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకు గాను 832.30 అడుగులు కాగా, రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి నిల్వలు 215 టీఎంసీలకు గాను 51.9636 టీఎంసీలకు చేరుకుంది. ప్రాజెక్టు వద్ద ఇంకా కేవలం 8 అడుగుల నీటి మట్టం పెరిగితే.. సంగమేశ్వరం ఆలయంలోని నీరు చేరితే.. వేపదారు శివలింగం కృష్ణమ్మ ఒడిలోకి చేరుతుంది. వాస్తవానికి ప్రతి ఏడాది జూన్, జూలై నెలలో ఎగువ ప్రాంతంలో వర్షం కురిస్తే.. దిగువనున్న శ్రీశైలం రిజర్వాయరకు వరదనీరు వచ్చి చేరేది. వాస్తవానికి జూన్, జూలై నెలలో వర్షాలు కురిస్తే దిగువన్న శ్రీశైలానికి వరద నీరు వచ్చి చేరేది. ఈ ఏడాది ముందుగా ఒక నెల ముందుగానే ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శ్రీశైలానికి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో సోమవారం గర్భాలయంలోని వేపదారు శివలింగం నీట మునిగే అవకాశం ఉంది.



సబ్సిడీలు కాదు.. గిట్టుబాటు ధర కావాలి

- సంప్రదాయాల వెనుక శాస్త్రీయత
- గరికపాటి నరసింహారావు

6లో

కర్నూలులో ఒకరికి కొవిడ్

- రోగిని జీజీహెచ్ ప్రత్యేక వార్డుకు తరలింపు



క్యూఆర్ కోడ్‌తో బిల్లుల చెల్లింపు

సోలార్ వినియోగంపై మరింత ప్రచారం

● ట్రాన్స్‌కో ఎస్ఈ జి. సుధాకర్ కుమార్

మహానంది, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోలార్ వినియోగంపై గృహ విద్యుత్ వినియోగదారులకు మరింత చేరువ అయ్యేందు కోసం ప్రచారం చేపడుతామని ట్రాన్స్‌కో ఎస్ఈ జి. సుధాకర్ కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఎస్ఈ మహానంది సమీపంలోని దేవస్థానం కాలనీలో ఏర్పాటు చేసిన సోలార్ సిస్టమ్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో 1575 గృహాలకు సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చెయ్యాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు 475 సోలార్ సిస్టమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈనెలాఖరులోగా 500 వరకు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం మహానంది విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు.

నేటి నుంచి శ్రీశైలం రిజర్వాయర్ ప్లంజ్ పూల్ సర్వే

నంద్యాల టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం ప్లంజ్ పూల్‌ను సర్వే మంగళవారం నుంచి చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తలు సోమవారం సున్నిపెంటకు చేరుకున్నారు. పూణేకు చెందిన శాస్త్రవేత్తలు ఎంఎస్ బిస్ట్ అజయ్, డి.సోనావనే వీఎస్ కట్టే, రీసెర్చ్ అసిస్టెంట్ రాకీ నాలుగు రోజులు పాటు ప్లంజ్ పూల్‌ను సర్వే చేయనున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు.

నీటి పన్ను చెల్లించండి

కేసీ కెనాల్ ప్రాజెక్ట్ సాగునీటి సంఘం చైర్మన్

కేసీ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి:

నంద్యాల మున్సిపాలిటీ జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఆయకట్టు రైతులు నీటి పన్ను చెల్లించి కేసీ కెనాల్ అభివృద్ధికి చెల్లించాలని కేసీ కెనాల్ ప్రాజెక్ట్ సాగునీటి సంఘం చైర్మన్ బన్నూరు రామలింగా రెడ్డి కోరారు. సోమవారం స్థానిక కేసీ కెనాల్ ప్రాజెక్ట్ నీటి వినియోగదారుల యాజమాన్య సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చైర్మన్ ప్రసంగిస్తూ కోస్తా రైతులు పన్ను చెల్లింపు విషయంలో అప్రమత్తంగా ఉంటారని, అందుకే అక్కడి సాగునీటి సంఘాలకు ప్రభుత్వ గ్రాంట్ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. మన రైతులు సైతం పన్ను విషయంలో గతంలోలా కాకుండా చిత్తశుద్ధితో చెల్లిస్తే కేసీకి ప్రభుత్వం మరింత గ్రాంటు మంజూరు చేస్తుందన్నారు. కేసీ ఈఈ ప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి కెనాల్ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని అన్నారు. ప్రతి నియోజకవర్గానికి రూ. 2 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ సమావేశంలో డీఈఈ రవికుమార్, ఏఈ మునాఫ్, డీసీ చైర్మన్లు కాటం రెడ్డి తులసీశ్వర్ రెడ్డి, శీలం బాస్కర్ రెడ్డి, వెంకంట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో డీఈఈ, ఈఈ, చైర్మన్, వైస్ చైర్మన్లు

సై..సై..సైకిల్..!





పాణ్యం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : సామాన్యుడికి అందుబాటులో ఉంటూ అతి సామాన్య ధరకు లభించే ఏకైక వాహనం సైకిల్. నేడు ప్రతి ఇంట్లో సైకిల్ కనిపిస్తుంది. పర్యావరణ హితంగా, ఆరోగ్యానికి మేలు చేసే, సరళమైన రవాణా సాధనం సైకిల్. నిజానికి 20 ఏళ్ల క్రితం వరకూ ఇళ్లలో సైకిల్ ఉంటే గొప్ప, అప్పట్లో బైక్‌లు, కార్లు తక్కువే. విద్యార్థులు, ఉద్యోగుల్లో చాలా మంది సైకిళ్లపైనే వెళ్లేవారు. రోడ్లపై సైకిళ్లతోనే ఒకరినొకరు పోటీ పడేవాళ్లు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ రోజులు భలే మంచి రోజులు. కాలక్రమేణా సైకిళ్ల వినియోగం తగ్గింది. కాలుష్యం బాగా పెరిగిపోయింది. ఈ రోజుల్లో సైకిల్ అంటే వ్యాయామం కోసం, బరువు తగ్గడం కోసమే చాలా మంది వాడుతున్నారు. కానీ ఎన్ని రకాల వాహనాలు వచ్చినా సైకిల్ క్రేజ్ సైకిల్‌దే. ఇప్పటికీ జన సామాన్యానికి సైకిలే ఆధారం. అంతటి గొప్ప సైకిల్‌కు ఓ గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో 2018లో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ జూన్ 3వతేదీని ప్రపంచ సైకిల్ దినోత్సవంగా ప్రకటించింది. ఈ సందర్భంగా ఈ ప్రత్యేక కథనం..

- సామాన్యుడి 'ఆరోగ్య వాహనం'
- నేడు ప్రపంచ సైకిల్ డే



మానవ జీవితంలో సైకిల్:

మానవ జీవితంలో సైకిల్‌కు ప్రత్యేకత ఉంది. మిలటరీ, పోలీసు, సమాచార సరఫరా, వ్యాయామం, క్రీడాకార వ్యవస్థలో సైకిల్‌కు ప్రత్యేకత ఉండడం గమనార్హం. నేడు ఎంతో మందికి సైకిల్ సేవలందిస్తోంది. పాల వ్యాపారులు, పేపర్‌బాయ్స్, క్రీడాకారులు, వ్యాయామ క్రీడలో, చిన్నపిల్లలకు, విద్యార్థులకు, వికలాంగులకు, వ్యాపారులతో పాటు ఎన్నో స్వచ్ఛంద సంస్థల్లో సైకిల్ కీలక సేవలందిస్తోంది. ఆరోగ్య రవాణా సాధనంగా పర్యావరణ సాదనంగా సైకిల్ ఉపయోగపడుతోంది. సైకిల్ వాడకం వల్ల ఇంధన సమస్య ఉండదు. భారతదేశంలో 1938లో సైక్లింగ్ క్రీడ మొదలైంది. సైక్లింగ్ సమాఖ్య ఆఫ్ ఇండియా ఈ క్రీడను జాతీయ క్రీడగా ప్రభుత్వం నిర్ణయించింది. మౌంటెన్ బైకింగ్ ప్రధాన క్రీడగామారింది. గీత 15 సంవత్సరాలుగా హిమాచల్‌లో ఈ సైకిల్ క్రీడను క్రమం తప్పకుండా నిర్వహిస్తుంది. ఈ క్రీడల్లో ఎంతో మంది ప్రపంచ ఛాంపియన్లుగా అవతరించారు. సిక్కిం ప్రభుత్వం పెద్ద మొత్తంలో సైకిల్ రేసు విజేతలకు బహుమతులు అందజేస్తుంది. ఆసియా, ఒలంపిక్ క్రీడల్లో సైక్లింగ్ క్రీడనుచేర్చింది తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా హైదరాబాదులో సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేసింది. త్వరలో ఏపీ ప్రభుత్వం అమరావతిలో సైకిల్ ట్రాక్‌ను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉంది.



ఎన్నికల గుర్తుగా సైకిల్:

సైకిల్ బొమ్మను ఎన్నికల గుర్తుగా భారత దేశంలో ఎన్నికల సంఘం వాడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీలకు గుర్తు సైకిల్ కావడం విశేషం.



జిల్లాలో ఏటా 15 వేల సైకిళ్ల అమ్మకాలు

నంద్యాల జిల్లాలో 30కు పైగా సైకిల్ స్టోర్‌లు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో ఏటా 12 వేల నుంచి 15 వేల వరకు సైకిళ్ల అమ్మలు జరుగుతున్నాయి. ఆదరణ వంటి ప్రభుత్వ పథకాలతో సైకిళ్ల వినియోగం పెరిగింది. టైర్ల అమ్మరాలు, పంచర్ షాపులు, రేడియం షాపులు, పెయింటింగ్స్, విడి భాగాల చిరు వ్యాపారులు, పేద కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.



ప్రభుత్వాలు అవగాహన కల్పించాలి

సైకిల్ తొక్కడం వల్ల కలిగే ఆరోగ్య లాభాలను ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పించాలి. సైకిల్ పోటీలు నిర్వహించి గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను, విద్యార్థులను ప్రోత్సహించాలి. 40 యేళ్ల క్రితం మా తాత అహ్మద్ హుశేన్ సైకిల్ మెకానిక్‌గా ఉండేవారు. 1983లో 15 సైకిళ్లతో మా తండ్రి చాంద్ బాషా సైకిళ్ల వ్యాపారం ప్రారంభించారు. 2017లో షోరూం ప్రారంభించాం.

-సికిందర్‌బాషా, భారత్ సైకిల్ ఏజెన్సీ, నంద్యాల



అమ్మకాలు పెరిగాయి

1996 జూన్ 6న 150 సైకిళ్లతో వ్యాపారం ప్రారంభించాం. రూ.4 వేల నుంచి రూ. 40 వేల విలువైన సైకిళ్లు ఉన్నాయి. అప్పటి నంద్యాల ఎంపీ ఎస్పీవై రెడ్డి తన ఫ్యాక్టరీ కార్మికులకు 600 మందికి సైకిళ్లు ఇచ్చి సైకిళ్లను ప్రోత్సహించారు. పదేళ్ల క్రితం వరకు మోటారు సైకిళ్ల వినియోగంతో సైకిళ్ల అమ్మకాలు తగ్గుతున్న దశలో సైకిళ్ల మార్పుతో మళ్లీ గణనీయంగా పెరిగాయి. ఎక్కువగా చిన్నపిల్లల సైకిళ్ల అమ్మకాలు పెరిగాయి. పెద్దల సైకిళ్లు తగ్గిపోయాయి. కొత్తగా బ్యాటరీ సైకిళ్లు మార్కెట్లోకి రావడంతో పిల్లలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు.

- కేదార్‌నాథ్, సుధాలక్ష్మి సైకిల్ మార్ట్, నంద్యాల





ఫ్యాన్సీ సైకిళ్లపై మొగ్గు

యువత ఎక్కువగా ఫ్యాన్సీ సైకిళ్లపై మొగ్గు చూపుతున్నారు. పాత మోడల్ తక్కువ అమ్మకాలు జరుగుతున్నాయి. 1961లో మా తాత బొగ్గరపు పుల్లయ్యశెట్టి సైకిల్ వ్యాపారం ప్రారంభించారు. అనంతరం మా తండ్రి రిక్షా పుల్లయ్య వ్యాపారాన్ని విస్తృతం చేసి రిక్షాల అమ్మకాలు ప్రారంభించారు. మూడు తరాలుగా చేస్తున్న ఈ వ్యాపారంలో ఎన్నో

- పవన్‌కుమార్, మహాలక్ష్మి సైకిల్ మార్ట్, నంద్యాల

సబ్సిడీలు కాదు.. గిట్టుబాటు ధర ఇవ్వాలి

- సంప్రదాయాల వెనుక శాస్త్రీయత
- ప్రవచనకర్త పద్మశ్రీ గరికపాటి నరసింహారావు



ప్రవచనాలు చేస్తున్న గరికపాటి నరసింహారావు

కర్నూలు కల్చరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం చేసి అన్నం పెట్టే రైతులకు సబ్సిడీల కన్నా వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తే రైతుల్లో ఆత్మస్థైర్యం నింపినట్లు అవుతుందని ప్రముఖ ప్రవచనకర్త పద్మశ్రీ గరికపాటి నరసింహారావు అన్నారు. సోమవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (టీఏ ఎంసీసీఐ) ఆధ్వర్యంలో, పరాశక్తి పవర్ టెక్నాలజీస్, పల్లెకిసాన్ సంస్థల సౌజన్యంతో ఏర్పాటు చేసిన రైతు చైతన్య వేదిక సదస్సులో ఆయన ముఖ్యవక్తగా ప్రసంగించారు. ఈ సదస్సును రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. గరికపాటిని శాలువ, పూలదండ, జ్ఞాపికలతో టీజీ వెంకటేశ్ ఘనంగా సత్కరించారు. సదస్సులో గరికపాటి ప్రసంగిస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విధానంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. మన సంప్రదాయాలను మర్చిపోరాదని, వాటి వెనుక శాస్త్రీయత ఉన్నదని అన్నారు. పదేళ్ల క్రితం ఇజ్రాయిల్ దేశం నుంచీ బియ్యం దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండేదని, నేడు ప్రపంచ దేశాలన్నీ భారత దేశ పంట ఉత్పత్తులపై ఆసక్తి చూపిస్తున్నాయని అన్నారు. అయితే దేశంలో పండించిన పంట దేశంలోని ప్రజలకు తొలుత చేరిన తర్వాతే విదేశాలకు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత వెంకటరెడ్డి, బిల్లవరం వీర రాఘవ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, పద్మశ్రీ అవార్డు గ్రహీత వెంకటరెడ్డి, బిల్లవరం వీర రాఘవరెడ్డి, నిర్వాహక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



గరికపాటిని సత్కరిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య

కర్నూలులో ఒకరికి కొవిడ్ పాజిటివ్

- రోగిని జీజీహెచ్ కొవిడ్ వార్డుకు తరలింపు



కర్నూలు హాస్పిటల్, జూన్ 2 (ఆంధ్ర జ్యోతి): కర్నూలు జిల్లాలో ఒకరికి కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఆరు రోజుల క్రితం ఎమ్మిగనూరు మండలం కల్లుగోట్ల గ్రామానికి చెందిన ఓ 65ఏళ్ల వృద్ధుడు తీవ్ర ఆయాసం, జ్వరంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి వచ్చారు. రోగికి మెడిసిన్ విభాగానికి చెందిన వైద్యులు అడ్మిషన్ చేయించుకున్నారు. రోగికి బీపీ, మధుమేహంతో పాటు ఆయాసం ఎక్కువ ఉండటంతో ఆర్‌టీపీసీఆర్ కొవిడ్ టెస్టు నిర్వహించారు. సోమవారం ఈ పరీక్షలో రోగికి కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. వైద్యాధికారులు అధికారులు అప్రమత్తమయ్యారు. హాస్పిటల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా.డి.శ్రీరాములు కొవిడ్ వార్డును సందర్శించారు. రోగి మెడికల్ వార్డు నుంచి కొవిడ్ వార్డుకు షిఫ్ట్ చేశారు.

అధికారుల నిర్లక్ష్యం..

కొవిడ్ కేసులు రాష్ట్ర వ్యాప్తంగా కేసులు బయట పడుతుండటంతో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఆదేశాలతో కొద్దిరోజుల క్రితం కొవిడ్ వార్డును అధికారులు ఏర్పాటు చేశారు. పది మంచాల సామర్థ్యంతో వెంటిలేటర్లను ఉంచారు. కొవిడ్ వార్డుకు ఓనర్సింగ్ స్టాఫ్‌ను మూడు షిఫ్టులలో వేసి అదికారులు చేతులు దు లుపుకున్నారు. కొవిడ్ మందులు ఏర్పాటుచేసిన వైద్యులు, డ్యూటీ డాక్టర్లు, ఎంఎన్‌వో, ఎఫ్‌ఎన్‌వో, శానిటేషన్ సిబ్బందిని ఇంత వరకు నియమించకుండా అధికారులు నిర్లక్ష్యం వహించారు. జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి లక్షణాలో ఎవరు వచ్చినా జనరల్ మెడిసిన్ వైద్యులే చికిత్స అందిస్తున్నారు.

సిబ్బందిని నియమిస్తాం:

ఆసుపత్రిలో కొవిడ్ పాజిటివ్ కేసు ఒకటి నమోదు అయ్యింది. పాత గైనిక్ వార్డులో ఏర్పాటుచేసిన కొవిడ్ వార్డులో పూర్తిస్థాయిలో సిబ్బంది, వైద్యులను నియమిస్తాం. రోగికి మధుమేహం, బీపీ, ఆయాసం, జ్వర లక్షణాలు ఉన్నాయి.

డా.డి.శ్రీరాములు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

ఉద్యోగుల్లో అవినీతి చెదలు

5వ పేజీ తరువాయి

బాధిత రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వీఆర్వోకు నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఇవన్నీ ఉదాహరణలు మాత్రమే.



చట్టానికి చిక్కకుండా వివిధ రూపాల్లో..

ఉమ్మడి కర్నూలు, నంద్యాలలోని రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, ట్రెజరీ, ఆర్టీఏ, పోలీసు, ఎక్సైజ్, ఇరిగేషన్, వైద్యఆరోగ్యశాఖ, గృహ నిర్మాణం, సాంఘిక సంక్షేమశాఖ, ఐసీడీఎస్, కమర్షియల్ ట్యాక్స్ తదతర ప్రధాన శాఖల్లో అవినీతి రాజ్యమేలుతోందనే ఆరోపణలు కలవు. ఆయా శాఖల్లో పనిచేసే కొందరు అధికారులు, సిబ్బంది విచ్చలవిడిగా దోచుకుంటున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెడుతున్నారనే విమర్శలున్నాయి. అవినీతిలో మునిగితేలుతున్న అధికారులు చట్టానికి చిక్కకుండా వివిధ రూపా(కొత్తవిధానాల)ల్లో లంచాలు పొందుతున్నారు. ఇదే క్రమంలో ఏసీబీ అధికారులు చేసే అరకొర దాడులతో ఆయా సందర్భాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్తదారులు వెతుక్కుంటూ మరీ అవినీతికి బాటలు వేసుకుంటున్నారని సమాచారం.

కనిపించని మార్పు...

ఉమ్మడి జిల్లాలో ఎక్కడ చూసినా.. ఏ శాఖను కదిలించినా.. అవినీతి జోరుగా సాగుతోందనే ప్రచారం జరుగుతుంది. పలుశాఖల్లో పనిచేస్తున్న కొందరు అధికారులు, సిబ్బంది చేతివాటం ప్రదర్శించి ఏసీబీకి పట్టుబడినా అవినీతి అధికారుల్లో మార్పు కనిపించడం లేదు. చివరకు ఎంతో కొంత సమర్పిస్తే తప్ప పనిచేయడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రజల నుంచి పెద్దఎత్తున లంచాలు తీసుకుంటున్నారనే విమర్శలున్నాయి.

● నంద్యాల జిల్లాలో కొన్నేళ్లుగా నమోదైన కేసులు

సంవత్సరం	కేసులు
2015	12
2016	09
2017	18
2018	18
2019	19
2020	07
2021	12
2022	08
2023	13
2024	03
2025	02

(ఇప్పటి వరకు)

ఫిర్యాదులపైనే స్పందిస్తారనే ప్రచారం..

ఏసీబీ అధికారులు తమ దృష్టికి వచ్చినా ఫిర్యాదులపైనే స్పందిస్తారనే ప్రచారం ఉంది. బాధితులు వెళ్లి వారిని సంప్రదిస్తేనే వస్తారని.. లేకుంటే ఉదాసీనంగా వ్యవహరించి గాలికి వదిలేస్తారనే అభిప్రాయం లేకపోలేదు. అయితే నిఘా ఉంచి జిల్లాలో దాడులు మరింత పెంచితే తప్ప అవినీతిరాయుళ్ల ఆటకట్టించే అవకాశం కనిపించడం లేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏసీబీ అధికారుల తనిఖీలు ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో ఆశించిన స్థాయిలో జరగలేదు. ఇదే అదునుగా భావించి అక్రమార్కులు సైతం బరితెగించి లంచావతారం ఎత్తారు. పైసలిస్తే తప్ప పనిచేయని దుస్థితి. ఏడాదికి కనీసం 15 కేసులు మించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

కొంత అలజడి..

కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలో ఏసీబీ అధికారుల దాడులు ఆశించిన స్థాయిలో లేవు. అయినప్పటికీ పలు శాఖల్లో అవినీతి అధికారుల్లో మాత్రం కొంత అలజడి ఉంది. పలు శాఖల్లో పనిచేస్తున్న అవినీతి అధికారులు, సిబ్బంది నేటికీ లంచాలకు చేయి చాపడం గమనార్హం. పట్టుబడిన సందర్భంలో మాత్రం ఉద్యోగులు, ఆయా శాఖల్లో కలవరం రేపుతోంది. తాజాగా ఆళ్లగడ్డ విద్యుత్‌శాఖ ఏడీఈ రవికాంత్‌చౌదరి ఏసీబీ అధికారులకు చిక్కాడు. కళ్లు చెదిరే ఆస్తులు, బంగారు నగలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉత్కంఠ రేపింది.

సమాచారం అందిస్తే చర్యలు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అవినీతిపరులు, ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన అధికారులు, సిబ్బందిపై తమకు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటాం. అక్రమార్కులను నియంత్రించడంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలి. ప్రభుత్వ ఉద్యోగులతో ఎవరైనా ఇబ్బందులు ఎదుర్కొంటే నేరుగా ఏసీబీ అధికారులను సంప్రదిస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. బాధితులు నేరుగా లేదంటే టోల్‌ఫ్రీ నెంబర్ 1064 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు.

- సోమన్న, డీఎస్పీ, ఏసీబీ కర్నూలు

దారి తప్పుతున్న నాలుగో సింహం

కర్నూలు క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పోలీసులు దారి తప్పుతున్నారు. చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ అవినీతి అక్రమాలకు తెర లేపుతున్నారు. ప్రమాదం జరిగితే ఓ రేటూ.. బెయిల్ కావాలంటే ఇంకో రేటూ.. కేసు పెట్టలన్నా మరో రేటూ.. రికవరీ చేసినా లాభమే.. చార్జ్‌సీట్లతో సంపాదనే.. కౌంటర్ కేసులుంటే రెండు వైపులా లాభమే.. ఇలా ఒక్కటేమిటి.. ప్రతి స్టేషన్‌లో సంపాదన మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. నాలుగో పట్టణ సీఐ మధుసూదన్‌గౌడు, హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ రూ.80వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులు చిక్కిన ఘటనతో పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది.

- ట్రాఫిక్ విభాగంలో పని చేస్తున్న ఓ సీఐ బైక్ పోయిందని కేసు నమోదు చేసేందుకు రూ.3వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఈయనతో పాటు ఓ కానిస్టేబుల్ కూడా అడ్డంగా బుక్కయ్యాడు. కోడుమూరు సర్కిల్ పరిధిలో ఓ ఎస్ఐ రూ.50వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు
- ఐదేళ్ల క్రితం గోస్పాడు పోలీస్ స్టేషన్‌లో పనిచేసే ఎస్ఐ టీసీ పోయిందని సర్టిఫికేట్ ఇచ్చేందుకు రూ.30వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికాడు
- ఆరేళ్ల క్రితం కర్నూలు తాలుకా పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ సీఐ లంచం తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కాడు. ఈయనతో పాటు మరో కానిస్టేబుల్ కూడా ఏసీబీకి చిక్కాడు. ఐదేళ్ల కింద ఆదోనిలో ఓ సీఐ మద్యం వ్యాపారిని బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడటంతో పోలీసు అధికారులు గుర్తించి ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు.



హెడ్ కానిస్టేబుల్ రవికుమార్‌ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు (ఫైల్)

- కర్నూలు తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఓ ముగ్గురు పోలీసు అధికారులు కుమ్మక్కై 105 కిలోల వెండి నగలు మాయం చేసి అమ్మేసుకున్నారు. ఈ ఘటన అప్పట్లో పోలీస్ శాఖలో సంచలనంగా మారింది. ఈ కేసులో ఓ ఇద్దరు అధికారులను సస్పెండ్ చేయగా.. మరో ఇద్దరిపై బదిలీ వేటు వేశారు.

అంతా సహాయకులే..

జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో ఉన్న సీఐలు తమకు అనుకూలంగా ఉన్న వారినే సహాయకులుగా నియమించుకుంటున్నారు. అతని ద్వారానే వసూళ్లకు పాల్పడుతున్నారు. ఏ చిన్న కేసైనా, పెద్ద కేసైనా అతని ద్వారా లావాదేవీలు నడుపుతున్నారు. ఏసీబీ అధికారులకు పట్టుబడిన పలు పోలీసు అధికారుల కేసులను పరిశీలిస్తే.. పోలీసు అధికారితో పాటు వారి కింద పని చేస్తే ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు కూడా ఏసీబీలకు చిక్కుతున్నారు.

'అవినీతి' పోలీసుల ఇళ్లలో సోదాలు

- నిందితులను కోర్టులో హాజరుపరిచిన ఏసీబీ
- 14 రోజుల పాటు రిమాండ్
- కర్నూలు జిల్లా జైలుకు తరలింపు

కర్నూలు క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన కర్నూలు నాలుగో పట్టణ సీఐ మధుసూదన్‌గౌడు, హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ ఇళ్లల్లో ఏసీబీ అధికారులు సోమవారం సోదాలు నిర్వహించారు. రూ.80వేలు లంచం తీసుకుంటూ సీఐ, హెడ్ కానిస్టేబుళ్లు ఆదివారం ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. సోమవారం తెల్లవారుజామున 4 గంటల వరకు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లోనే వీరిద్దరిని విచారించారు. అనంతరం ఏసీబీ ఓ బృందం ఏల్కూరు బంగ్లాలో ఉన్న సీఐ మధుసూదన్‌గౌడు ఇంట్లో తనిఖీలు చేశారు. మరో బృందం గణేష్‌నగర్‌లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ రవి కుమార్ ఇంట్లో తనిఖీలు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ ఇంట్లో మధ్యాహ్నం 2 గంటల వరకు తనిఖీలు చేసి ఆదాయానికి మించి ఆస్తులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు దొరక్కపోవడంతో కుటుంబసభ్యులతో సంతకాలు చేయించుకున్నట్లు తెలిసింది. అలాగే సీఐ ఇంట్లో సాయంత్రం 6 గంటల వరకు తనిఖీలు చేశారు. ఈయన ఇంట్లో మాత్రం పలు కీలక డాక్యుమెంట్లు, ఆధారాలు లభించినట్లు సమాచారం. అయితే సీఐ ఇంట్లో జరిగిన సోదాలపై కూడా వివరాలు వెల్లడించే విషయంలో ఏసీబీ అధికారులు గోప్యత పాటించారు. గతంలో ఎవరి ఇళ్లలోనైనా సోదాలు చేస్తే అన్ని వివరాలు వెల్లడించేవారు. ప్రస్తుతం మాత్రం ఎలాంటి వివరాలు చెప్పకుండా గోప్యత పాటించడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

కోర్టులో హాజరు, రిమాండ్

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సీఐ మధుసూదన్ గౌడ్, హెడ్ కానిస్టేబుల్ రవికుమార్‌లను ఏసీబీ అధికారులు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారిని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ఏసీబీ తరపున వాదనలు విన్న న్యాయాధికారి నిందితులను 14 రోజుల పాటు రిమాండ్‌కు విధించారు. దీంతో ఏసీబీ అధికారులు నిందితులను జిల్లా కేంద్రంలోని పంచలింగాల జైలుకు తరలించారు.

క్యూఆర్ కోడ్‌తో బిల్లుల చెల్లింపు

- జూన్ నుంచి విద్యుత్ శాఖలో అమలు
- కరెంటు బిల్లుల చెల్లింపు ఇక సులభం
- స్కాన్ చేయగానే వినియోగదారుల వివరాలు
- ప్రభుత్వ సర్వీసులకు లేని నూతన విధానం

నంద్యాల కల్చరల్/ మద్దికెర, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల చెల్లింపు ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు విద్యుత్ శాఖ అడుగులు వేసింది. క్యూఆర్ కోడ్ ద్వారా బిల్లుల చెల్లింపు ప్రక్రియ వినియోగదారులకు జూన్ నుంచి అందుబాటులోకి తీసుకువచ్చింది. వినియోగదారులు చెల్లించే ఈ బిల్లును క్యూఆర్ కోడ్‌ను ప్రవేశపెట్టింది. కొన్ని రోజుల క్రితం వరకు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా బిల్లుల చెల్లింపు జరిగేది. ప్రస్తుతం వాటిని నిలిపివేశారు. దీంతో మరలా తిరిగి వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించడానికి కార్యాలయానికి వెళ్లేవారు. విద్యుత్ సేవలను మరింత సులువు చేసేందుకు క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చామని మద్దికెర మండల విద్యుత్ ఏఈ మహ్మద్ రఫీ సోమవారం తెలిపారు. మండలంలో మొత్తం 11గ్రామాలు, 8 పంచాయతీలు ఉన్నాయి. దాదాపు 11వేలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. జూన్ నెల నుంచి విద్యుత్ బిల్లుల్లోనే క్యూఆర్ కోడ్ రావడం వల్ల విద్యుత్ బిల్లులు చెల్లించడానికి సులువు అవుతుందని వినియోగదారులు అన్నారు.

చెల్లింపు ఇలా..

ఈ నెలలో జారీచేస్తున్న విద్యుత్ బిల్లులో ఈ విధానాన్ని తీసుకొచ్చింది. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, వాటి ద్వారా విద్యుత్ బిల్లుపై వున్న క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేయాలి. సంబందిత వినియోగాదారులకు చెందిన బిల్లు యొక్క మొత్తాన్ని చూపిస్తుంది. వినియోగాదారుడు ఆయా యాప్‌ల ద్వారా కంటిన్యూ చేసి పాస్‌వర్డ్ కొట్టి ఓకే చేసిన వెంటనే విద్యుత్ బిల్లు చెల్లింపు జరిగిపోతుంది.



జిల్లాలో 7 లక్షల విద్యుత్ కనెక్షన్లు ...


జిల్లాలో గృహ వినియోగాదారులు దాదాపుగా 5,30,000, వాణిజ్య కనెక్షన్లు 75వేలకు పైగా, పరిశ్రమల కనెక్షన్లు 14వేలు, వ్యవసాయ కనెక్షన్లు 60వేలు, ప్రభుత్వ కార్యాలయాలు, వీధిదీపాలు ఇతరత్ర కనెక్షన్లు కూడా వున్నాయి. మొత్తం జిల్లాలో 7లక్షలకు పైగా విద్యుత్ కనెక్షన్లు వున్నాయి. నూతన విధానం ప్రభుత్వ సర్వీసులకు లేదని తెలస్తోంది. అరియర్స్ బిల్లు పెండింగ్‌లో ఉన్న వినియోగదారులకు ఈ వెసులుబాటు ఉండదని అధికారుల చెబుతున్నారు. గతనెల బిల్లు చెల్లించకపోయినా ఈనెల బిల్లులో ఈ క్యూఆర్‌కోడ్ కనిపించదని విద్యుత్ శాఖ అధికారులు అంటున్నారు.

సేవలు మరింతచేరువ చేసేందుకు...

విద్యుత్ సేవలు వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు క్యూఆర్‌కోడ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చాం. ప్రభుత్వ సర్వీసులు మినహా అన్ని ప్రైవేటు సర్వీసులన్నింటిలోనూ ఈ ప్రక్రియ ను అందుబాటులోకి తీసుకువచ్చాం. బిల్లులు ఏవిధంగా చెల్లించాలో బిల్లు రీడర్స్ వినియోగాదారులకు అవగాహన కల్పించాలని కూడా చెప్పాం.

- సుధాకర్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్ శాఖ, నంద్యాల

బిల్లు చెల్లింపు చాలా ఈజీ..



క్యూఆర్‌కోడ్ ద్వారా విద్యుత్ బిల్లు చెల్లింపు చాలా ఈజీగా ఉంది. మన వద్ద ఫోన్‌పేలో తగినంత మొత్తం వుంటే ఎప్పుడైనా బిల్లు చెల్లించొచ్చు. వీటి ద్వారా టైమ్‌తో పాటు బిల్లు చెల్లింపు కేంద్రానికి వెళ్లకుండా బిల్లు చెల్లించే అవకాశముంది.

క్రిష్ణ మౌర్య, విద్యార్థి

పల్లె పాలవెల్లి



పాలు పోస్తున్న రైతు

అధిక పాలు ఇచ్చే జాతులు

ఆవులు - హెచ్‌ఎఫ్, జెర్సీ, సాహివాల్

గేదెలు - ముర్రా, జఫ్రాబాదీ, మెహసానా

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మనిషి తీసుకునే ఆహారంలో పాలు ప్రధానం. ఆహారపరంగానే కాకుండా ఆధ్యాత్మిక విషయాల్లో కూడా పాలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. పాల ప్రత్యేకత గురించి ప్రజల్లో చైతన్యం కల్గించడానికి ప్రతి ఏడాది ప్రపంచ పాల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. మన దేశంలో అత్యధికంగా టీ, కాఫీ తాగనిదే రోజు గడవదు. ప్రపంచ పాల ఉత్పత్తిలో భారతదేశం మొదటి స్థానంలో ఉంది. మన జిల్లాలో వ్యవసాయం తర్వాత ఎంతో మందికి జీవనోపాధి కల్పిస్తున్న రంగాల్లో పాడిపరిశ్రమ ఒకటి. వ్యవసాయ రంగానికి తోడుగా పాడిపరిశ్రమ గ్రామీణ జీవితంలో, ఆర్థిక వ్యవస్థలో ప్రధానం. రైతులు పాల ఉత్పత్తితో స్వయం సమృద్ధి చెందారు. మధ్యవర్తులపై ఆధారపడకుండా ప్రత్యక్షంగా మార్కెట్‌కు పాలు విక్రయించే అవకాశాలు పెరిగాయి.



నంద్యాల జిల్లాలో 1.2 లక్షల ఆవులు, 2.94 లక్షల గేదెలు ఉన్నాయి. అందులో పునరుత్పత్తి సామర్థ్యం కల్గిన ఆవులు 72 వేలు, గేదెలు 1.74 లక్షలు ఉండగా మొత్తం 2.48 లక్షలు గేదెలు, ఆవులు ఉన్నా యి. అలాగే మిల్క్ యాని మల్స్ 43వేల ఆవులు, 1.04 లక్షల గేదెలు ఉన్నా యి. మొత్తం 4,14,395 ఆవులు, గేదెలు ఉన్నా యి. ప్రతిరోజు సగటున ఇండియన్ స్టాండర్స్ ప్రకారం ప్రతి మనిషి 500 గ్రాముల పాలు తీసు కుంటున్నారు. దీని ప్రకారం మన జిల్లాలో 10 లక్షల లీటర్ల పాలు అవసరం. కానీ మన జిల్లాలో అంతకు మించి 1.53 లక్షల లీటర్ల పాలు అదనంగా ఉత్పత్తి జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ స్టాండర్స్ ప్రకారం ప్రతి మనిషి 800 గ్రాములు తీసుకుంటున్నారని గణాంకాలు చెబుతు న్నాయి. ఈ ప్రకారం జిల్లాకు 16 లక్షల లీటర్ల పాలు అవసరం. అంటే 4.47 లక్షల లీటర్ల లోటు ఉంది. దీంతో పాల ఉత్పత్తిని ప్రభుత్వం మరింత పెంచేందుకు పాడి రైతులకు అండగా ఇటీవలే పలు చర్యలు తీసుకున్నారు.



పశువుల కోసం ప్రభుత్వం నిర్మించిన నీటితొట్లు

ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఇవీ..

వైసీపీ ప్రభుత్వం పాడి పరిశ్రమపై చూపిన నిర్లక్ష్యం కారణంగా పాల దిగుబడి తగ్గిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పశువులకు ప్రధానంగా షెడ్లను నిర్మించేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా 90శాతం సబ్సిడీతో రైతులను ప్రోత్సహిస్తూ మినీ గోకులాల నిర్మాణాలను చేపట్టింది. జిల్లాలో రికార్డు స్థాయిలో 854 మంజూరు కాగా 750 షెడ్‌లకు పైగా పూర్తయ్యాయి. జిల్లాలో రూ.12 లక్షల సబ్సిడీతో మూడేళ్ల వరకు వర్తించేలా పశువులకు బీమా సౌకర్యాన్ని కల్పించారు. అలాగే వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా పశునీటితొట్టిలు ఏర్పాటు చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద పశువులకు పచ్చిగడ్డి ఎల్లప్పుడు లభించే విధంగా 10సెంట్ల నుంచి 50సెంట్ల వరకు పాడిరైతులు పచ్చిగడ్డి సాగు చేసుకునేలా ప్రోత్సహిస్తూ 90శాతం ప్రభుత్వ వాటాగా నిధులను మంజూరు చేసింది. అలాగే ప్రస్తుతం పశువులకు జిల్లాకు 200 మెట్రిక్ టన్నుల పశుదాణా కూడా రైతులకు పంపిణీ చేస్తున్నారు.

4,14,395 ఆవులు, గేదెలు

పాడి పరిశ్రమకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు

రోజూ 60 లీటర్ల పాలు ఇస్తున్నాయి



నాకు 10 పాడిగేదెలు ఉన్నాయి. ప్రతిరోజు 60 నుంచి 70 లీటర్ల పాలు ఇస్తున్నాయి. వట్టిగడ్డితో పాటు ప్రతిరోజు పచ్చిగడ్డి వేయడంతో పాటు, పరిసరాల పరిశుభ్రత కూడా ముఖ్యం. షెడ్డులో ఎప్పుడూ గాలి, వెలుతురు ఉండాలి. ఏ చిన్న సమస్య వచ్చినా పశువైద్యులను సంప్రదిస్తు న్నాం. మరింత దిగుబడి సాధించడానికి ప్రయత్నిస్తున్నాం. **- గురునాథరెడ్డి, బూజునూరు, గడివేముల మండలం**

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం



నాకు 9 గేదెలున్నాయి. ఐదు చూడిగేదెలు ఉండగా ప్రస్తుతం నాలుగు గేదెలు పాలు ఇస్తున్నాయి. ప్రతి రోజు 30 లీటర్ల పాలు వస్తున్నాయి. పాలను డెయిరీలకు ఇక్కడే విక్రయిస్తున్నాం. గేదెలకు క్రమం తప్పకుండా వైద్యుల సలహాతో వ్యాక్సినేషన్ వేయిస్తున్నాం. గేదెలకు రాత్రి పూట దోమతెరలను వాడుతున్నాం. దూడల పెంపకంలో శ్రద్ధ తీసుకున్నాం. **- రాంబాబు, బుక్కాపురం, మహానంది మండలం**

మంచి ఉత్పాదకత ఉండే జాతి పశువులను పెంచాలి



పాల ఉత్పత్తి పెరగాలంటే మెరుగైన లక్షణాలతో ఉన్న జాతి పశువులను పెంచుకోవాలి. గేదెలు, ఆవులు ప్రతి మూడు లీటర్ల పాలు ఇచ్చిన ప్పుడు వాటికి కేజీ దాణా ఇవ్వాలి. ప్రతిరోజు ఎండుగడ్డితో పాటు 20నుంచి40 కేజీల పచ్చిగడ్డి ఇవ్వాలి. పశువులకు దాణా ఎంత అవసరమో వాటికి నీడ కూడా అంతే అవసరం. రెగ్యులర్‌గా వ్యాక్సినేషన్, డీ వార్మింగ్ చేయించాలి. మంచినీరు తాపాలి. పశువైద్యులను సంప్రదిస్తూ ఉండాలి.

- డాక్టర్ గోవింద్‌నాయక్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, నంద్యాల

ఆర్‌టీఈ యాక్ట్ ద్వారా 2,289 మంది విద్యార్థుల ఎంపిక

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యాహక్కు చట్టం (209) ప్రకారం 12(1) కింద ఒకటో తరగతిలో ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలో ప్రవేశాల కోసం మొదటి విడత ద్వారా 2289 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ సోమవారం తెలిపారు. ఉచిత ప్రవేశాల కోసం 3362 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, మొదటి విడత ల్యాటరీ పద్ధతి ద్వారా 2289 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన వారిని ఆయా పాఠశాలల్లో ప్రవేశాలు పొందేలా ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

చిరుత దాడిలో దూడ మృతి

వెలుగోడు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ సమీప ప్రాంతంలోని గట్టు తాండలో సోమవారం తెల్లవారుఝామున చిరుతపులి ఆవులమందపై దాడి చేసింది. ఓ ఆవుదూడను అటవీ ప్రాంతంలోకి లాక్కెళ్లినట్లు బాధితుడు లక్ష్మానాయక్ తెలిపారు. ఈ విషయాన్ని బాధితుడు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా అటవీశాఖ సిబ్బంది గోపి, అటవీశాఖ పశు వైద్యాధికారి జుబేరు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ విషయంపై అటవీశాఖ అధికారి ఎంఎ ఖాన్ వివరణ కోరగా చిరుత దాడి చేసిన విషయం వాస్తవేమనని, బాధితుడికి నష్ట పరిహారం అందేల చర్యలు తీసుకొంటామని తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

పత్తికొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఆంజనేయనగర్ సమీపంలో ఓ వివాహిత సోమవారం ఆత్మహత్యకు చేసుకుంది. వివరాల మేరకు.. కొత్త ఎక్సైజ్ కార్యాలయం సమీపంలో కల్పన(30) భర్త రాజశేఖర్ ఆచారితో కలిసి ఉంటోంది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న సీఐ జయన్న సిబ్బందితో కలిసి స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. మృతురాలికి ఇద్దరు సంతానం. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

తల్లిదండ్రులు మందలించారని..

- పురుగుమందు తాగి బాలుడి బలవన్మరణం

ఓర్వకల్లు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించడంతో ఓ బాలుడు పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని లొద్దిపల్లెలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ సునీల్‌కుమార్ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన కురువ రామకృష్ణ (16) 9వ తరగతి వరకు చదివాడు. నిత్యం సెల్‌ఫోన్ చూసేవాడు. దీంతో తల్లిదండ్రులు మందలించారు. మనస్థాపం చెంది పురుగుమందు తాగాడు. హుటాహుటిన కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. తండ్రి కురువ వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా.. కార్మికుడి మృతి

బనగానపల్లె, జూన్ 2(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలం నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామం వద్ద నాపరాయి ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడడడంతో బేతంచెర్ల మండలం బుగ్గానుపల్లె గ్రామానికి చెందిన నాపరాయి కార్మికుడు చాకలి నాగేశ్ (30) సోమవారం మృతి చెందాడు. పలుకూరు నుంచి బేతంచెర్లకు నాపరాయిని ట్రాక్టర్‌లో తీసుకు వెళ్తుండగా పలుకూరు ఉన్నత పాఠశాల సమీపంలో ఎదురుగా వస్తున్న మోటార్ సైకిలిస్టును తప్పించబోయిన ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నాపరాళ్లు నాగేశ్ మీద పడడంతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టంకు తరలించారు. నందివర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి రమాదేవి భార్య, ఇరువురు చిన్నారులు ఉన్నట్లు తెలుస్తోంది. మృతుని తండ్రి నాగరాజు, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నందివర్గం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

పాము కాటుతో మహిళ..

బేతంచెర్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన మహిళ పాము కాటుకు గురై మృతి చెందింది. ఈ సంఘటన సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన తులసికొండ తిమ్మయ్య భార్య రంగమ్మ (46) పొలంలో మధ్యాహ్నం వేరుశనగ పంట తీస్తుండగా.. ఆమె చేతికి పాము కాటు వేసింది. కూలీలు బేతంచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి నలుగురు సంతానం ఉన్నారు.



రంగమ్మ(ఫైల్)

పెళ్లి బృందంపై వైసీపీ శ్రేణుల దాడి

- కోసిగిలో ఘటన, పలువురికి గాయాలు
- 11 మంది వైసీపీ వర్గీయులపై కేసు నమోదు



కోసిగిలోని 3వ వార్డులో పెళ్లి బృందంపై దాడి చేస్తున్న వైసీపీ సానుభూతిపరులు

కోసిగి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వివాహం అనంతరం ఊరేగింపు నిర్వహిస్తున్న పెళ్లి బృందంపై వైసీపీ నాయకులు దాడి చేసిన సంఘటన కర్నూలు జిల్లా కోసిగి మండలం 3వ వార్డులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కోసిగిలోని మూడో వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు పోతుల తాయన్న కుమారుడి వివాహం అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీకి సంబంధించిన పాటలు పెట్టారంటూ ఆ కాలనీలోని వైసీపీ శ్రేణులు మూకుమ్మడిగా ఆ పెళ్లి బృందంపై దాడి చేసి గాయపరిచారు. దీంతో బాధితులు పోతుల నరసమ్మ, పోతుల తాయన్న, పోతుల నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వైసీపీకి చెందిన పెండేకంటి లోకారెడ్డి, రాజశేఖర్, గోవిందు, శ్రీరాములుతో పాటు మరి కొంత మంది తమపై దాడి చేసి గాయపరిచారని, మహిళల మెడల్లోని మంగళసూత్రాలు, బంగారు చైన్లు లాగేసుకున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు 11 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హనుమంతరెడ్డి తెలిపారు.



వైసీపీ నాయకులే దాడి చేశారని చెబుతున్న టీడీపీ శ్రేణులు

దేవదాయ భూములు కొట్టేశారు..!

- 26.91 ఎకరాలు కైవసం చేసుకున్న వైసీపీ నాయకులు
- ఆ భూముల విలువ రూ.3-4 కోట్లు పైమాటే
- రెవెన్యూ రికార్డుల్లో జంగం మఠం భూములుగా నమోదు
- దేవదాయ భూములు రక్షించాలని టీడీపీ నాయకుల ఫిర్యాదు



జేసీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు, జూ 2 (ఆంధ్రజ్యోతి): తుగ్గలి గ్రామంలో దేవదాయ భూములను వైసీపీ నాయకులు సొంతం చేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకొని దర్జాగా ప్రభుత్వ సదుపాయాలు అనుభవిస్తున్నారు. రెవిన్యూ రికార్డుల్లో ఇప్పటికీ జంగం మఠం భూముగా కనిపిస్తున్నప్పటికీ, వాటిని స్వాధీనం చేసుకున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు, ఏపీ శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, ఆ గ్రామ సర్పంచి రవిప్రకాశ్ సోమవారం జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ (జేసీ) బి. నవ్యను కలిసి తుగ్గలి రెవెన్యూ గ్రామం పరిధిలో సర్వే నంబరు 604/ఏ1లో 5.16 ఎకరాలు, సర్వే నంబరు 604/బి1లో 3.70 ఎకరాలు 605/ఏ1లో 14,75 ఎకరాలు, సర్వే నంబరు 605/ఏ2లో 0.50 సెంట్లు, సర్వే నంబరు 605/బిలో 2.80 ఎకరాలు కలిపి 26.91 ఎకరాలు జంగం మఠం పేరుతో, పెరవళి రంగయ్య పేరిట ఉన్నాయని తెలిపారు. అక్కడ ఎకరం రూ.10-15లక్షలకు పైగా పలుకుతున్నదని, అన్యాక్రాంతమైన దేవదాయ భూములు విలువ రూ.3-4 కోట్లకుపైగా ఉంటుందని అన్నారు. గతంలో తమ పలుకుబడి, అధికారం అడ్డం పెట్టుకొని రెవెన్యూ రికార్డులను మార్చేసి, పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకున్నారని అన్నారు. ఆ రికార్డులను తనఖా పెట్టి బ్యాంకుల్లో రుణాలు, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు, రైతు భరోసా సాయం తీసుకున్నారని ఆరోపించారు. పై సర్వే నంబర్లు భూములపై సమగ్ర విచారణ జరిపి స్వాధీనం చేసుకొని దేవదాయ శాఖకు లేదా జంగం మఠంకు అప్పగించాలని ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేయిస్తామని, దేవదాయ భూములని తేలితే తప్పక స్వాధీనం చేసుకుంటామని జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

రోడ్లు భవనాల స్థలం కూడా వదల్లేదు

వైసీపీ నాయకులు తుగ్గలిలో రోడ్లు, భవనాల శాఖ (ఆర్ అండ్ బీ) స్థలాను కూడా వదల్లేదని తుగ్గలి నాగేంద్ర ఆరోపించారు. తుగ్గలి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఎంతో విలువైన రోడ్లు భవనాల శాఖ స్థలాలను ఆక్రమించి ఏకంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి నెలనెల రూ.లక్షలు బాడుగుల రూపంలో వసులు చేస్తున్నారని వివరించారు. దీనిపై కూడా సమగ్ర విచారణ చేసిన రోడ్లు భవనాల శాఖకు చెందిన విలువైన స్థలాలను సంరక్షించాలని కోరుతూ జాయింట్ కలెక్టరు బి. నవ్యకు మరో ఫిర్యాదు చేశారు.

బాధితులకు న్యాయం చేయండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, జూన్ 2 (ఆంధ్ర జ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని అధికారులను ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. సోమవారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఎస్పీ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 83 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. ఏఎస్పీ అడ్మిన్ హుశేన్‌పీరా, సీఐలు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని...

కర్నూలులో ఇంటింటి సర్వే చేయించే ఉద్యోగాలు ఇప్పిస్తామని నెలకు రూ.26వేలు జీతం, అని చెప్పి రవి, ధనుంజయ్ తమ ఇద్దరి నుంచి రూ.3లక్షలు తీసుకుని మోసం చేశారని సీతారామ్‌నగర్ చెందిన టి.గురు, పవన్, భరత్, గురు కిషోర్ వర్మ ఫిర్యాదు చేశారు. ఇంటర్ చదివిన తమ అమ్మాయికి, అబ్బాయికి కర్నూలు కలెక్టరేట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఫరూక్ అనే వ్యక్తి రూ.2.26 లక్షలు తీసుకుని మోసగించాడని అరుంధతినగర్‌కు చెందిన డి. ఉమాబాయి ఫిర్యాదు చేశారు. కెనడాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి హైదరాబాదు చెందిన అభిలాష్ రూ.7 లక్షలు తీసుకుని మోసం చేశారని బుధవారపేటకు చెందిన అఖిలేష్ ఫిర్యాదు చేశారు.

వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం

- వైసీపీ కార్యకర్త వీడియో వైరల్



వీడియోలో ప్రవీణ్

పత్తికొండ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండలం దూదెకొండ గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే యువకుడు ఆదివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. పత్తికొండ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆత్మహత్యాయత్నానికి ముందు ప్రవీణ్ మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జీలకు విన్నవించుకున్నట్లుగా ప్రవీణ్ వీడియోలో ప్రస్తావించాడు. రాష్ట్రంలో వైసీపీ కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులతో ఇబ్బందులు పెడుతుందని దీనిపై విచారణ చేయాలని పేర్కొన్నాడు. కేవలం తాను వైసీపీ కార్యకర్తగా ఉన్నాడన్న నెపంతో గ్రామానికి చెందిన కొందరు కక్ష పూరీతంగా వ్యవహరిస్తున్నారని, దీనికితోడు స్థానిక పోలీసులు తనపై తప్పుడు కేసులు బనాయించడంతో తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పేర్కొన్నాడు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైసీపీపై ఈ విధంగా వ్యవహరిస్తుందని రక్షణ కల్పించాలని పేర్కొన్నాడు. పత్తికొండ సీఐ కూటమి నేతల ఒత్తిళ్లతో వేధింపులకు పాల్పడుతున్నాడని, తనను, తన కుటుంబాన్ని రక్షించాలని కోరారు. ప్రవీణ్ మాట్లాడినట్లు సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ కావడం ముందు రోజే పురుగుమందు తాగడంతో పత్తికొండ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై పత్తికొండ సీఐ జయన్నను వివరణ కోరగా కుటుంబ గొడవల కేసుతో రాజకీయ పార్టీలతో సంబంధం లేదన్నారు. దీనికి అప్పులే కారణమని తేలిందన్నారు.

సమన్వయంతో కార్యాచరణ

- ఆర్‌యూ వీసీ వెంకట బసవరావు



మాట్లాడుతున్న ఆర్‌యూ వీసీ వెంకట బసవరావు

కర్నూలు అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): న్యాక్‌లో గ్రేడ్ సాధించే దిశగా అన్ని విభాగాల హెచ్‌వోడీలు సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ రూపొందించుకున్నామని ఆర్‌యూ వీసీ వెంకట బసవరావు అన్నారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అన్నివిభాగాల హెచ్‌వోడీలు, రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ బోయ విజయ కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్య, వసతులే లక్ష్యంగా కొత్త ఏడాది ప్రణాళికతో సిద్ధంగా ఉన్నామని అన్నారు. వనరులు, సౌకర్యాల్లో పురోగతి సాధించేందుకు లక్ష్యాలను నిర్దేశించామని తెలిపారు. క్వాంటమ్ టెక్నాలజీ, పునరుత్పా దక శక్తి వనరులు, డ్రోన్ టెక్నాలజీకు సంబంధించి క్యాంపస్‌లో విద్యార్థులకు సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించామన్నారు. డీన్‌లు సుందరానంద పుచ్చా, భరత్, పరీక్షల విభాగం సీవీ కృష్ణారెడ్డి, కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు, పీఆర్‌వో రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో డ్యూయల్ కోర్సులకు సిద్ధం కండి

డిగ్రీ కోర్సులను సింగిల్ మేజర్ కోర్సుల నుంచి డ్యూయల్ మేజర్ కోర్సులుగా మార్పు చేయడంతో విద్యార్థులకు మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ఉపకులపతి వి. వెంకట బసరావు అన్నారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీ కాన్ఫరెన్సు హాలులో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలకు అనుబంధంగా ఉన్న డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ డ్యూయేల్ మేజర్ సబ్జెక్టులుగా కాలేజీలు అందించే కోర్సులకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఈ డ్యూయల్ మేజర్ విధానానికి మారనున్న డిగ్రీ కోర్సులకు విద్యార్థులను ప్రోత్సహించాలని ఆయన ప్రిన్సిపాళ్లను కోరారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

మహానందిలో భక్తుల రద్దీ



దర్శించుకుంటున్న భక్తులు

మహానంది, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులను పురస్కరించుకొని వేలాదిమంది భక్తులు కుటుంబ సమేతంగా మహానంది క్షేత్రానికి దైవదర్శనం కోసం తరలి వచ్చారు. పరమశివుడికి ప్రీతివంతమైన సోమవారం ప్రధాన ఆలయంలో అభిషేకాలను జరుపుకొన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాక కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఆదివారం రాత్రే వివిధ వాహనాల ద్వారా భక్తులు తరలివచ్చారు. దీంతో దేవస్థానానికి చెందిన వసతి గృహాలు నిండిపోవడంతో సమీపంలోని ప్రైవేట్ లాడ్జీలకు డిమాండ్ పెరిగింది. తెల్లవారుజాముననే ఆలయ ప్రాంగణంలోని రుద్రగుండం కోనేరుతో పాటు రెండో ప్రాకారంలోని పూల కోనేర్లల్లో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి, మహానందీశ్వరుడు, కామేశ్వరీదేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. రాత్రి వరకు మహానంది పరిసరాల్లో భక్తుల సందడి నెలకొంది.

శ్రీశైలంలో వెండి రథోత్సవం



వెండి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

నంద్యాల కల్చరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు ఆలయ వేదపండితులచే నిర్వహించారు. సోమవారం సప్తమి తిథి సందర్భంగా స్వామి అమ్మవార్లకు మేళతాళాలతో వెండిరథోత్సవం ఆలయ మాడవీధుల్లో నిర్వహించారు. అనంతరం సహస్ర దీపార్చన కార్యక్రమం నిర్వహించారు. దేవస్థాన సేవగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాపట్ల లక్ష్మీ బృందంచే సంప్రదాయ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ప్రాచీన కళల పరిరక్షణలో భాగంగా నిత్యకళారాధన కార్యక్రమంలో హరికథ, బుర్రకథ, సంప్రదాయనృత్యం, వాయుద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో శ్రీనివాసరావు, వేదపండితులు, దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

'మున్సిపల్ డీఈపై చర్యలు తీసుకోవాలి'



ధర్నా చేస్తున్న కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు

నంద్యాల టౌన్, జూన్2(ఆంధ్రజ్యోతి): నంద్యాల పురపాలక సంఘంలో ఉన్న వాటర్ వర్క్ డీఈ నాగభూషణం రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకుడు గౌస్, కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పురపాలక కార్యాలయంలో సీఐటీయూ, పురపాలక యూనియన్ కార్యాలయం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ.. డీఈ నాగభూషణం ఒప్పంద కార్మికులను అసభ్య పదజాలంతో దూషించారని ఆరోపించారు. ఇప్పటికైనా ఆయనపై స్థానిక మంత్రి, జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో చర్యలు తీసుకునే వరకు విధులకు హాజరు కాబోమని ఒప్పంద కార్మికులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆచారి, కృష్ణ, జఫార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మోసాలను ఎండగట్టడానికే 'వెన్నుపోటు దినం': వైసీపీ



నంద్యాలలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

నంద్యాల రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మోసాలను ఎండగట్టేందుకే బుధవారం 'వెన్నుపోటు దినం' నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా, ఎమ్మెల్సీ జిల్లా పరిశీలకురాలు కల్పలతారెడ్డి తెలిపారు. సోమవారం నంద్యాలలోని వైసీపీ కార్యాలయంలో 'వెన్నుపోటు దినం' పోస్టరును ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ మాబున్నీసా, పిపి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: వెన్నుపోటు ర్యాలీని బుధవారం ఉంటుందని, విజయవంతం చేయాలని వైసీపీ నంది కొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ధారా సుధీర్ అన్నారు. సోమవారం ఆయన కొత్తపల్లిలోని మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి స్వగృహంలో ఆ పార్టీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు. వెన్నుపోటు సభకు సంబంధించిన పోస్టరును విడు దల చేశారు. జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రంగ, ఎంపీటీసీలు శివన్న, బాలరాజు, సర్పంచ్ నాగ ఎల్లయ్య, సింగిల్ విండో మాజీ చైర్మన్‌లు రామసుబ్బారెడ్డి, జనార్దన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్‌బాషా, మండల కోఆప్షన్ సభ్యులు మహ్మద్ గౌస్, నాయకులు నాగ ఎల్లయ్య, నాగలక్ష్మిరెడ్డి, రామలింగారెడ్డి, రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో పోస్టరు విడుదల చేస్తున్న నాయకులు



నంద్యాల ప్రభుత్వాసుపత్రి

సాయంత్రం 4గంటల తర్వాత

ఆపరేషన్లు బంద్

- సర్జన్లు కూడా అందుబాటులో ఉండరు
- నంద్యాల వైద్యశాలలో దుస్థితి
- గత్యంతరం లేక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న రోగులు

నంద్యాల హాస్పిటల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అత్యవసర ఆపరేషన్లు నంద్యాల జీజీహెచ్‌లో అందుబాటులో లేక రోగులు తల్లడిల్లుతున్నారు. సాయంత్రం వేళల్లో జరిగే ప్రమాదాల్లో సర్జరీలు చేయాలంటే ఈవోటీ, సర్జన్లు లేకపోవడంతో జీజీహెచ్‌కు వెళ్లాలంటే బాధితులు భయపడుతున్నారు. నంద్యాల జీజీహెచ్‌లో సాయంత్రం 4 గంటలు దాటితే సర్జరీలు ఉండవు.. సర్జన్లు అందుబాటులో ఉండరు. ఆస్పత్రిలో పగటి పూటనే రోగులకు సర్జరీలు చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో, రాత్రివేళల్లో ఏదైనా రోడ్డు ప్రమాదాలకు గురైన బాధితులు వస్తే నంద్యాల జీజీహెచ్‌లో కేవలం ప్రథమ చికిత్సకే పరిమితం కావాల్సి వస్తోంది. ఆపరేషన్లు చేయాల్సి వస్తే గత్యంతరంలేక రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. లేకపోతే మరుసటిరోజువరకు వేచిఉండాల్సిన దుస్థితి ఉంది. జీజీహెచ్‌లో అన్ని సౌకర్యాలుంటాయనే ఉద్దేశంతో నిరుపేదలు ప్రభుత్వ ఆస్పత్రికి వస్తుంటారు. జీజీహెచ్ స్థాయి పెంచిన తర్వాత ఓపీ కూడా మూడురెట్లు పెరిగింది. గతంలో దాదాపు 350ఉండే ఓపీ ప్రస్తుతం స్థాయి పెరిగిన తర్వాత రోజుకు దాదాపు 1200మంది ఓపీ ద్వారా చికిత్సలు పొందుతున్నారు. రోగులు అత్యధికంగా పెరిగినా వారికి తగ్గట్టుగా సిబ్బంది లేకపోవడం శోచనీయం. ఆస్పత్రిలో ఎక్కువగా న్యూరో సర్జన్లు, ఆర్థో, ఈఎన్‌టీ, జనరల్ సర్జన్ ఆపరేషన్లు పగటిపూట ఎక్కువగా జరుగుతున్నాయి. రాత్రివేళల్లో పరిస్థితి భిన్నంగా ఉంటోంది. అత్యవసర సేవలకోసం క్యాజువాల్టీని ఆశ్రయిస్తే కేవలం ప్రథమ చికిత్స చేసి సర్జరీల కోసం బయటకు పంపుతున్నారు. నంద్యాల జీజీహెచ్‌లో ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్ (ఈవోటీ) లేదని తెలుస్తోంది. ఈవోటీకి కనీసం 15మంది సిబ్బంది ప్రత్యేకంగా ఉండి 24గంటలు ఆపరేషన్లు చేసేందుకు టీమ్‌గా ఉండాల్సి ఉంది. అయితే అలాంటి టీమ్ జీజీహెచ్‌లో లేదనేది సమాచారం. అంతేకాకుండా జీజీహెచ్‌లో చికిత్స చేయించుకుంటున్న రోగులకు రాత్రివేళల్లో అనుకోకుండా ఆపరేషన్ అవసరమైతే వారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటుంది. ఆస్పత్రిలో యూరాలజీ, నెఫ్రాలజీకి సంబంధించిన ఆపరేషన్లు చేయడంలేదనేది సమాచారం. ఈ విభాగాల్లో ఓపీ చూసి పంపుతున్నారేకానీ సర్జరీలు చేయడం లేదని తెలుస్తోంది. ఆపరేషన్లకు సంబంధించిన పరికరాలు జీజీహెచ్‌లో అందుబాటులో లేవని సమాచారం. జీజీహెచ్‌లోని అనస్థీషియా వైద్యులు సాయంత్రం 4 గంటల వరకే అందుబాటులో ఉంటున్నట్లు తెలిసింది. కాగా జీజీహెచ్ ఆపరేషన్ థియేటర్‌కు శనివారం, ఆదివారం కూడా తాళం వేసి ఉండటం గమనార్హం.

ఈవోటీలో ఉండాల్సిన సిబ్బంది ఇలా..

ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌లో ప్రతి షిఫ్ట్‌కు అనస్థీషియా ఒకరు, ఇద్దరు పీజీలు, ఒక అసిస్టెంట్ వైద్యులు, ఒక అసోసియేట్ వైద్యుడు, ముగ్గురు సీనియర్ స్టాఫ్‌నర్స్‌లు, ముగ్గురు వార్డుబాయ్‌లు మరికొందరు సిబ్బందిని ఏర్పాటు చేయాల్సి ఉంది. జీజీహెచ్‌లో ఈవోటీ సిబ్బంది మాట అటుంచితే అసలు ఈవోటీనే లేదనేది విశ్వసనీయ సమాచారం.

ఇదిలా ఉండగా శనివారం హుసేనాపురం గ్రామానికి చెందిన చెన్నకేశవులు రోడ్డు ప్రమాదంలో గాయపడి నంద్యాల జీజీహెచ్‌కు వైద్యచికిత్స నిమిత్తం వచ్చారు. కాగా చెన్నకేశవులుకు రోడ్డు ప్రమాదంలో చెవి తెగిపోవడంతో క్యాజువాల్టీలో వైద్యులు సర్జరీ కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. ఆస్పత్రిలో ఈఎన్‌టీ సర్జన్ అందుబాటులో ఉంటే నంద్యాల జీజీహెచ్‌లో ఎందుకు సర్జరీ చేయలేదనేది ప్రశ్నార్థకంగా మారింది.

శనివారం ఆపరేషన్లు ఉండవు



నంద్యాల జీజీహెచ్‌లో శనివారం ఆపరేషన్లు చేయరు. ఆపరేషన్ థియేటర్ శుభ్రం చేసేం దుకు కేటాయించాం. ఎమర్జెన్సీలో రాత్రివేళల్లో కూడా ఆపరేషన్లు చేస్తు న్నాం. జీజీహెచ్‌లో ఈవోటీ ఉంది. యూరాలజీ, నెఫ్రాలజీ ఆపరేషన్లు తక్కువగా చేస్తున్నాం. ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవం. చెన్నకేశవులుకు ప్లాస్టిక్ సర్జరీ కోసం కర్నూలుకు రెఫర్ చేశాం.

- డాక్టర్ మల్లేశ్వరి, సూపరింటెండెంట్



ఆపరేషన్ థియేటర్

ఎన్‌సీసీతో దేశభక్తి పెరుగుతుంది

- మూడో అదనపు జిల్లా న్యాయాధికారి అమ్మన్న రాజా



ఫైరింగ్ దృశ్యాన్ని తిలకిస్తున్న న్యాయాధికారి అమ్మన్నరాజా

నంద్యాల హాస్పిటల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీలో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో దేశభక్తి పెరుగుతుందని, సామాజిక అవగాహన కలుగుతుందని మూడో అదనపు జిల్లా న్యాయాధికారి అమ్మన్న రాజా అన్నారు. సోమవారం నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహిస్తున్న 9వ ఆంధ్రా బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ శిక్షణాశిబిరాన్ని ఆయన సందర్శించారు. ఎన్‌సీసీ అధికారులకు శిక్షణాశిబిరానికి అవకాశం కల్పించిన రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డా.జి.రామకృష్ణారెడ్డిని జడ్జి అభినందించారు. అనంతరం న్యాయాధికారి స్వయంగా ఫైరింగ్‌లో పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్ల ర్యాలీ: నంద్యాలలో ఎన్‌సీసీ కేడెట్లు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ప్లకార్డులతో భారీ ర్యాలీ నిర్వహించారు. డా.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 2047వికసిత భారత్ లక్ష్యంగా ప్రజలందరూ ఆర్థిక స్వావలంబన దిశగా అభివృద్ధి చెందాలన్నారు. డా.లలితాసరస్వతి, డిప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ శ్రీప్రియ, కమాండెంట్ కల్నల్ జోబి ఫిలిఫ్, ఎన్‌సీసీ ఆఫీసర్లు శ్రీదేవి, గీతాంజలి, ధర్మేంద్రసింగ్, ధర్మేంద్రకుమార్, కమాల్‌సా తదితరులు పాల్గొన్నారు.

'అర్హులకు పక్కా గృహాలు మంజూరు చేయాలి'



మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నందికొట్కూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఆర్ఆర్ నగర్‌లో ఉన్న నకిలీ ఇంటి పట్టాలను రద్దు చేసి, నిజమైన అర్హులైన లబ్ధిదారులకు పక్కా గృహాలు మంజూరు చేయాలని ఎంసీపీఐ(యు), సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు కోరారు. బైరెడ్డి శేషశయనారెడ్డి నగర్‌లో సుదీర్ఘ కాలంగా నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలంటూ ఎంసీపీఐ(యు) జిల్లా కన్వీనర్ లాజరస్, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు వెంకటేశ్వర్లు సోమవారం మున్సిపల్ చైర్మన్‌కు వారి నివాసం వద్ద వినతిపత్రం సమర్పించారు. ఎంసీపీఐ (యు) డివిజన్ కార్యదర్శి లింగాల శ్రీనివాసులు, సరోజమ్మ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకురాలు ఎస్‌బీబీ, కాటిపోగు సోమన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి'



మాట్లాడుతున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి

గడివేముల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగను మత సామరస్యంతో ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ సీసీ నాగార్జునరెడ్డి ముస్లిం మత పెద్దలకు సూచించారు. సోమవారం ఆయన ముస్లిం మత పెద్దలతో సమావేశమయ్యారు. ముస్లిం మతపెద్దలకు సలహాలు, సూచనలు అందజేశారు.

'న్యూక్లియస్' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో కళాశాల యజమానులు, అధ్యాపకులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో న్యూక్లియస్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. కళాశాల కరస్పాండెంట్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఓసీ కేటగిరీలో అనీషాతబుసుమ్ 10,280వ ర్యాంక్, ఎస్సీ కేటగిరీలో లిఖిత్ 1,145వ ర్యాంక్, ప్రదీప్ 2,949(ప్రిపరేటరీ ర్యాంక్), అమూల్య 5,486 (ప్రిపరేటరీ ర్యాంక్) సాధించినట్లు తెలిపారు. కళాశాల డైరెక్టర్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ జేఈఈ మెయిన్స్‌లో తమ కళాశాల విద్యార్థులు నీట్‌లో సీట్లు సాధించే అవకాశం ఉందని, అలాగే రాబోయే నీట్ ఫలితాల్లో కూడా కీ ని పరిశీలించాక ఐదు మెడికల్ సీట్లు సాధించే అవకాశం ఉందని అన్నారు.

అనాథ పిల్లలకు ఉచిత విద్య

ఆత్మకూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అనాథ పిల్లలతో పాటు నిరుపేద విద్యార్థులకు తమ పాఠశాలలో ఉచితంగా విద్యను అందిస్తామని ఆత్మకూరు పట్టణంలోని శ్రీపద్మావతి హైస్కూల్ డైరెక్టర్ ఆశ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఉచిత విద్యకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. సామాజిక దృక్పథంతో తల్లిదండ్రులు అనాథలతో పాటు తల్లి లేక తండ్రి మరణించిన నిరుపేద విద్యార్థులు ఎవరైనా ఉన్నట్లయితే ఎటువంటి ఫీజులు లేకుండానే తమ పాఠశాలల్లో అడ్మిషన్ కేటాయించి విద్యను అందిస్తామన్నారు.

ముగిసిన యోగా శిక్షణ

పాణ్యం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం సోమవారం ముగిసినట్లు ఆయుష్ వైద్యురాలు డాక్టర్ శ్రీదేవి తెలిపారు. మంగళవారం నుంచి గ్రామ స్థాయిలో యోగా శిక్షణా కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలో యోగా శిక్షకులు సుధాకర్, రమేష్ ఆయూష్ పర్యవేక్షణలో నిర్వహించినట్లు తెలిపారు. యోగా పోటీలను ఎంపీడీవో, ఎంఈవోల ఆధ్వర్యంలో మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'ఫీజుల దోపిడీని అరికట్టాలి'

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. సోమవారం డీఈవో జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంఆర్‌నాయక్, సందీప్, సాయికుమార్ మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభంకాకముందే పలు పాఠశాలల యాజమాన్యం పై తరగతికి అనుమతించాలంటే మొత్తం ఫీజులో 50శాతం చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని తల్లిదండ్రులను తీవ్రమైన ఒత్తిళ్లకు గురిచేస్తున్నారని, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పేరుతో వేలకువేల రూపాయాలు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. జోసఫ్, రాజేశ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

నంద్యాల మున్సిపాలిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సంఘాల విజ్ఞప్తిని మన్నించినందుకు ఎన్జీవోస్ అసోసియేషన్ నంద్యాల తాలుకా అధ్యక్షులు మణిశేఖర్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆయన పట్టణంలోని ఎస్పార్బీసీ కార్యాలయంలో మాట్లాడారు. బదిలీల ప్రక్రియ సమయాన్ని పెంచటంతో పాటు ఉద్యోగులకు పలు వెసులు బాట్లు కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అంధులు, మానసిక రుగ్మతలున్న వారికి ప్రాధాన్యమివ్వటంతో పాటు, వితంతు ఉద్యోగినీలకు బదిలీల్లో పెద్ద పీట వేయటం హర్షణీయమన్నారు. వచ్చే ఏడాది 31లోపు రిటైర్ అయ్యే ఉద్యోగులకు సైతం బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వటం వెనుక ప్రభుత్వ మానవతా దృకృథం తెలుస్తోందని అన్నారు.

'రేషన్ డీలర్లపై చర్యలు తీసుకోవాలి'



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ భాగ్యమ్మ

పాములపాడు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పాములపాడులోని రేషన్ డీలర్లపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ మేకల భాగ్యమ్మ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఆమె మాట్లాడుతూ జూన్ 1న రేషన్ డీలర్లు ప్రజా ప్రతినిధులతో రేషన్ పంపిణీ ప్రారంభించాల్సి ప్రొటోకాల్ ఉన్నా తనను పిలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తర్వులను ధిక్కరించిన రేషన్ డీలర్లపైన చర్యలు తీసుకోవాలని స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందించారు.

సారా విక్రేతల అరెస్టు

బండిఆత్మకూరు, జూన్2(ఆంధ్రజ్యోతి): సంతజూటూరు పికప్ ఆనకట్ట వద్ద సారా విక్రేత కృష్ణుడును అరెస్టు చేసినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. సోమవారం పరమటూరు గ్రామానికి చెందిన కృష్ణుడు పికప్ ఆనకట్ట వద్ద సారా అమ్ముతుండగా సిబ్బంది పట్టుకున్నారని చెప్పారు. అతడి వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నందికొట్కూరు: పట్టణంలో నీలిషికారి కాలనీలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు సారాను విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఐ జవ్రుల్లా తెలిపారు. ఈ దాడుల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ హెడ్‌కానిస్టేబుల్ శేఖర్, పద్మనాభం, కానిస్టేబుళ్ల సుధీర్ కుమార్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతులతో అధిక దిగుబడి

గడివేముల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో శాస్త్రీయ పద్ధతులను అవలంభించి అధిక దిగుబడులు సాధించవచ్చని భారతీయ వ్యవసాయ పరిశోదన మండలి శాస్త్రవేత్త సూగన్న, కేవీకే శాస్త్రవేత్త రమణయ్య అన్నారు. వికసతి కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా మండలంలోని దుర్వేసి, గడిగరేవుల కొరటమద్ది గ్రామాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులతో సమావేశమయ్యారు. ఏవో హేమసుందర్ రెడ్డి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నాగలూటిలో కార్డన్ సెర్చ్



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ సుబ్రహ్మణ్యం

మిడుతూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలూటి గ్రామంలో నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లల్లో పోలీసులు సోదాలు చేశారు. సీఐ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. కార్డన్ సెర్చ్‌లో 18 మద్యం బాటిళ్లను, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 16 మోటారు సైకిళ్లను, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఎస్ఐలు ఓబులేసు, తిరుపాలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

కొత్తపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కేతం వెంకట శివుడు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం వెంకట శివుడుతో పాటు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తహసీల్దార్ ఉమారాణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో భీమలింగమ్మ, స్వామి, లింగమయ్య, మహేష్, జయరాం, గోవిందు, శివన్న, వెంకటేశ్వర్లు, వెంకటలింగ పాల్గొన్నారు.

పోలీసులకు నెమలి అప్పగింత

మిడుతూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మిడుతూరులో సోమవారం పరమేష్ అనే వ్యక్తి ఇంటిపైన వాలింది. ఎగరలేని స్థితిలో ఉన్న నెమలిని గమనించిన పరమేష్ ఇంటి పైకి వెళ్లి నెమలిని పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు స్పందించి నెమలిని స్వాధీనం చేసుకుని రోళ్లపాడు అభయ అరణ్యంలో వదిలిపెట్టారు.

డబ్బుల కోసం తల్లిపై తనయుడి దాడి

మహానంది, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తనకు ఖర్చులకు డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో తనయుడు తల్లిపై దాడి చేసిన ఘటన ఎం.తిమ్మాపురం గ్రామంలో చోటు చేసుకుంది. మహానంది పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఎం.తిమ్మాపురానికి చెందిన వెంకటలక్ష్మమ్మకు ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు ప్రహ్లాదుడు పలుమార్లు తల్లిని డబ్బులు డిమాండ్ చేశాడు. దీంతో వెంకటలక్ష్మమ్మ తన పొలం కొంత తాకట్టుపెట్టి రూ.1.60 లక్షలు గతంలో ఇచ్చారు. మరల ఆదివారం తనకు ఖర్చుల కోసం రూ.లక్ష ఇవ్వాలని అడిగాడు. ఇందుకు తల్లి తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కుమారుడు ప్రహ్లాదుడు తల్లిపై ఘర్షణ పడి గాయపర్చాడు. వెంకటలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు ప్రలహ్లాదుడుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నీటి ప్రవాహానికి ఆటంకం

- మద్దిలేరు వాగులో పెరిగిన గుర్రపుడెక్క
- ఆందోళనలో రైతులు

బండిఆత్మకూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మద్దిలేరు వాగులో పలు చోట్ల గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోయింది. మండలంలోని నల్లమల అటవీ సమీపం నుంచి రామాపురం, బండిఆత్మకూరు, పార్నపల్లె, ఎ.కోడూరు గ్రామాల మీదుగా ఈ వాగు ప్రవహిస్తోంది. ఏటా వానాకాలంలో ఈ వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. కొన్నేళ్లుగా నదీ తీరం వెంట ఈ ప్రవాహం పంట పొలాలను ముంచెత్తుతుంది. దీంతో వందలాది మంది రైతులు నష్టపోతున్నారు. పొలాలు కోతు సైతం గురవుతున్నాయి. గత వారం క్రితమే పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ రాజకుమారి వాగులు, వంకలు వర్షాల వల్ల కల్గించే నష్టాలు, గుర్రపు డెక్క పరిస్థితిని ఎప్పటికప్పడు తెలియజేయాలని, నీటి ప్రవామానికి గుర్రపుడెక్క వల్ల మునకలు సంభవించే ప్రమాదం ఉంటుందని, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అలాంటి పరిస్థితులు ఉంటే తెలియ జేయాలని సూచించారు. అయితే నంద్యాల, ఆత్మకూరు ప్రధాన రహదారిలో ఎ.కోడూరు వద్ద మద్దిలేరు వంతెన దగ్గరే గుర్రపు డెక్క విపరీతంగా పెరిగి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. ఇది నిత్యం కళ్లారా చూస్తున్న అధికారులు గుర్రపు డెక్క తొలగింపులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.



ఎ.కోడూరు సమీపంలో మద్దిలేరు వాగులో పెరిగిన గుర్రపు డెక్క

పార్కును యథావిధిగా కొనసాగించాలి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న కౌన్సిలర్, నాయకులు

డోన్ టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూనగర్‌లో డాక్టర్ రామసుబ్బయ్య తోటలో మున్సిపల్ పార్కును, స్విమ్మింగ్ పూల్‌ను యథావిధిగా కొనసాగించాలని 25వ వార్డు కౌన్సిలర్ మిట్టా ఉమామహేశ్వరి కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రసాద్‌గౌడుకు, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, వైసీపీ నాయకుడు మిట్టా రవిలతో కలిసి ఆమె వినతి పత్రం అందజేశారు.

రాయితీ దాణా పంపిణీ

డోన్ రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పశువైద్యశాలలో 50 శాతం రాయితీతో సమీకృత దాణా పంపిణీ చేశారు. పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ డోన్ పశువైద్యశాలకు 60, కొత్తపల్లికి 60, కొచ్చెర్వుకు 50, చనుగొండ్ల పశువైద్యశాలలకు 50, పాడి పశువుల దాణా సంచులు వచ్చినట్లు తెలిపారు. ఒక సంచి దాణా రూ.1,110లు రాగా, ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ పోనూ, రూ.555లు చెల్లిస్తే సరిపోతుందన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రత్యేక అలంకరణలో సిద్ధ రామేశ్వరస్వామి



సిద్ధరామేశ్వరస్వామి మూల విరాట్

కొలిమిగుండ్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెలుం గ్రామంలో వెలసిన పురాతన సిద్ధ రామేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జేష్ఠ మాసం, సప్తమి పురస్కరించుకొని స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

షుగర్ వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దు

బనగానపల్లె, జూన్ 2(ఆంధ్రజ్యోతి): షుగర్‌ను నిర్లక్ష్యం చేయొద్దని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. సోమవారం మండలంలోని పలుకూరు గ్రామంలో షుగర్ వ్యాధిపై జేకేఆర్ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. దేశంలో పదికోట్ల మందికి షుగర్ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. మితి మీరిన బరువు, శారీరక శ్రమ లేకపోవడం, వంశపారపర్యంగా, మానసిక ఒత్తిడి వల్ల షుగర్ వస్తుందన్నారు. డాక్టర్ సలహాలు పాటించి మందులు వాడాలన్నారు. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే మృత్యువాత పడతారన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ, ఎర్రబాష, సుబ్బరాయుడు, లక్ష్మన్న, రవణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం హెల్పర్లకు శిక్షణ

బనగానపల్లె, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పాఠశాలల్లో పనిచేసే కుక్ కం హెల్పర్లకు ఒక్క రోజు శిక్షణా తరగతులను సోమవారం పట్టణంలోని బాలికల ఉన్నతపాఠశాలలో నిర్వహించారు. త్రిసభ్య కమిటీ సభ్యులు బనగానపల్లె తహసీల్దారు నారాయణరెడ్డి, ఎంపీడీవో రమణ, ఎంఈవో స్వరూప ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వంట ఎలా శుభ్రంగా చేయాలి, ఇతర నిబంధనలు వివరించారు. ఈ సందర్భంగా వంటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీ సుధాకర్, రాయలసీమ సలాం, తదితరులు పాల్గొన్నారు.

యాగంటిలో ఘనంగా పల్లకీ సేవ



పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీసేవ నిర్వహించారు. ఈవో చంద్రుడు, మౌళీశ్వరరెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డితో పాటు భక్తులు, ఆలయ పూజారులు పల్లకీలో స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

'పెత్తందార్లకు కేంద్ర ప్రభుత్వం వత్తాసు'

ప్యాపిలి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పెత్తందార్లకు వత్తాసు పలుకుతోందని సీఐటీయూ మండల కార్యదర్శి చిన్నరహిమాన్ విమర్శించారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సంఘం కార్యకర్తలతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నరహిమాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రభుత్వం కూడా సమర్థించడం బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల సంఘటిత పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఖాజా, లక్ష్మన్న, కాసీం, గౌసు, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే చేయించాలి

ఉయ్యాలవాడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కుందూనది సమీపంలోని ఈద్గా వద్ద కాంపౌండు నిర్మాణానికి సర్వే నెం.116 నందు గల 0.56 సెంట్ల భూమిని కొలతలు వేయించాలని ఉయ్యాలవాడ ముస్లింలు కోరారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దారు శ్రీనివాసులుకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ కాంపౌండు నిర్మాణానికి పంచాయతీరాజ్ అధికారులు రూ.22 లక్షల నిధుల ప్రతిపాదనలు పంపామన్నారు. గతంలో సర్వే చేయించాలని చలానా కట్టినా ఇంతవరకు చేయించలేదన్నారు. అదేవిధంగా సర్వేపల్లెకు చెందిన ఇరిగెల నాగేశ్వర్‌రెడ్డి పొలాన్ని కొలతలు వేయించాలని ఆయన కోరారు. అల్లూరు గ్రామానికి చెందిన చిన్నపుల్లన్న బోరుబావికి విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్ ట్రెజరీ అధికారికి సత్కారం

డోన్ రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎస్‌ఏ స్టేట్ సెక్రటరీగా ఎన్నికైన డోన్ సబ్ ట్రెజరీ అధికారి ఎంకే రఘునందన్‌ను డోన్ పెన్షనర్ల సంఘం నాయకులు సత్కరించారు. పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డోన్ పెన్షనర్ల సంఘం నాయకులు గాలయ్య, గోపాల్, సుబ్బరాయుడు, నరసింహులు, సబ్ ట్రెజరీ సిబ్బంది ప్రేమ్ కుమార్ నాయక్, భాస్కర్, జగదీష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగదుర్తి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ రూరల్ ఏఈ నాగేశ్వర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెల్దుర్తి 33 కేవీ ఫీడర్ లైన్ షిఫ్టు కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంటు ఉండదని పేర్కొన్నారు. జగదుర్తి సబ్ స్టేషన్ పరిధిలోని రైతులకు ఇవ్వాల్సిన త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 5గంటల నుంచి ఉదయం 10 గంటల వర కు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇస్తామని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

లక్ష్యానికి తూట్లు

- మూతపడ్డ సంపద సృష్టి కేంద్రాలు
- మూలనపడ్డ వాహనాలు
- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త
- భరించలేని దుర్వాసన
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



చాగలమర్రిలో మల్లెవేముల రహదారిలో పడేసిన చెత్తాచెదారం

ఆళ్లగడ్డ జూన్ 2(ఆంధ్రజ్యోతి): పొడి చెత్త, తడి చెత్త నుంచి సంపద లక్ష్యానికి తూట్లు పొడిచారు. అధికారుల అలసత్వంతో అది నీరుగారిపోతోంది. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన సంపద సృష్టి కేంద్రాలు నిరుపయోగంగా మారి చివరకు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గ్రామాల్లోని వ్యర్థాలను ఆయా గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరుగా మార్చి పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్న లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సంపద సృష్టి కేంద్రాలను ప్రవేశపెట్టారు. 2014-19 మధ్య కాలంలో ప్రతి పంచాయతీలో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను ప్రారంభించారు.

మొదట్లో విజయవంతం..

ఇంటింటి నుంచి నిత్యం చెత్త సేకరించి ఆయా కేంద్రాలకు తరలించేవారు. అప్పట్లో చాలా పంచాయతీల్లో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకాన్ని జగనన్న స్వచ్ఛ సంకల్పంగా మార్చి కేంద్రాలకు నిధులు ఇవ్వక నిర్లక్ష్యం చేయడంతో జీతాలు అందక సిబ్బంది పనులకు రాక చాలా చోట్ల ఈ కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో చెత్త సేకరణకు ఏర్పాటు చేసిన వాహనాలు, ట్రై సైకిళ్లు మూలన పడ్డాయి. దీంతో చెత్త సేకరణకు వాహనాలు రాక గ్రామ శివారుల్లో చెత్త గుట్టలుగా పేరుకుపోతుంది. ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ఈ చెత్త సంపద కేంద్రాలను నిర్మించారు. ఒక్కొక్క కేంద్రానికి సుమారు రూ. మూడు లక్షల వరకు వెచ్చించారు. ఈ కేంద్రాల ద్వారా ఘన వ్యర్థాల నిర్వహణ వర్మి కంపోస్టు తయారీ విధానంపై పలుమార్లు అధి కారులకు, సిబ్బందికి క్షేత్రస్థాయిలో శిక్షణ కూడా ఇచ్చారు. ఈ కేంద్రాలకు అవసరమైన యంత్ర పరికరాలను కూడా ఆయా గ్రామ పంచాయతీలకు సమకూర్చారు. పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి పెట్టకపోవడంతో ఎక్కడా వర్మి కంపోస్టు ఎరువులు తయారు అయిన దాఖలాలు కనిపించలేదు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తుంది. మండలంలోని కొట కందుకూరు గ్రామంలోని ఆదర్శ పాఠశాల సమీపం లోని చెత్త నిల్వ కేంద్రం నిరుపయోగంగా మారింది. గత టీడీపీ ప్రభుత్వంలో చెత్తనిల్వ నుంచి సంపద సృష్టించి విక్రయించి పంచాయతీకి ఆదాయం తెచ్చారు. అలాగే ఓబులంపల్లె, కొట కందుకూరు యాదవాడ తదితర గ్రామాల్లో లక్షలు వెచ్చించి నిర్మించిన కేంద్రాలు గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నిరుపయోగంగా మారాయి.



ఓబులంపల్లెలో శిథిలావస్థకు చేరిన వర్మి కంపోస్టు కేంద్రం

చెత్తను ఎక్కడ పడితే అక్కడ..

నియోజకవర్గంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఇంటింటికి తిరిగి సేకరించిన చెత్తాచెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయతీలో సేకరించిన చెత్తా చెదారాన్ని గ్రామ శివారులోని మల్లెవేముల గ్రామానికి వెళ్లే రహదారి పక్కన పడేస్తున్నారు. అలాగే శిరివెళ్ల గ్రామ పంచాయతీలో సేకరించిన చెత్తను నిల్వ చేసేందుకు సరైన స్థలం లేక గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కన నిల్వ చేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతుండటంతో రాకపోకలు సాగించే వారు అవస్థలు పడుతున్నారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో చెత్తను ఇళ్ల మధ్యనే పడేస్తుండడంతో దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చెత్త సంపద కేంద్రాలపై దృష్టి సారించి వాటిని తిరిగి ప్రారంభించి ఆయా పంచాయతీలకు ఆదాయ వనరుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి

- కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసులు

చాగలమర్రి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, బాలరాజు అన్నారు. సోమవారం మండలంలోని ముత్యాలపాడు, కేపీ తండా, పెద్దవంగలి గ్రామాల్లో కృషి విజ్ఞాన్ కేంద్రం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుల ఆదాయం పెంచడం, వ్యవసాయ ఖర్చులు తగ్గించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. ఎరువులు, పురుగు మందులు ఏ సమయంలో వాడితే మంచి దిగుబడులు వస్తాయన్న విషయాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ జిల్లా వనరుల కేంద్రం ఉప సంచాలకులు చెన్నయ్య, ఏవో ప్రభావతమ్మ, పశువైద్యాధికారులు సాయిబాబా, దీపకుమారి, ఏటీఎంఏ హరిబాబు, ఏపీసీఎన్‌ఎఫ్ నరేష్, ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జి నాగేశ్వర్‌రెడ్డి, వ్యవసాయ సిబ్బంది, నవీన్‌కుమార్‌రెడ్డి, ఉమా, జయకృష్ణ, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త శ్రీనివాసులు

పంట సాగులో పెట్టుబడులు తగ్గించుకోవాలి

ప్యాపిలి: పంటల సాగులో పెట్టుబడులు తగ్గించుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని జలదుర్గం, హుసేనాపురం గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం ద్వారా పంటల సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్త మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నందున పంటల సాగుపై అప్రమతంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అధికారులు వెంకటరెడ్డి, రాజేష్, కళ్యాణి, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

చాగలమర్రి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపల్లె గ్రామంలో కోదండరామాలయంలో సీతారామ లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు పుల్లయ్య, భీమయ్య, దాతలు కె.రామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. సీతారామ ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహించారు. టీడీపీ ఆళ్లగడ్డ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి ప్రతిష్ఠోత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ మహోత్సవంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి, టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, నాయకులు లక్ష్మీరెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఉసేన్‌రెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: మండలంలోని ఓబులంపల్లె గ్రామంలో సోమవారం పావన లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠను గ్రామ పెద్దలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు వెల్లా శేషయ్య శర్మ ఆధ్వర్యంలో కొలను భారతీ ఆశ్రమ పీఠాధిపతి శివయోగేంద్ర స్వామి ఆశీస్సులతో వైభవంగా నిర్వహించారు. అలాగే ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బైసాని రామసుబ్బయ్య, గ్రామపెద్దలు గౌరు వెంకటరామిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, మోహన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తొమ్మండ్రు వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



రాంపల్లెలో ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న మహిళలు

పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలి



ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

ప్యాపిలి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆ పార్టీ స్థానిక నాయకులు సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో టీడీపీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో రామచంద్రుడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



విద్యార్థిని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

డోన్ టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో 500 పైగా మార్కులు సాధించిన పట్టణంలోని 19మంది ఆర్యవైశ్య విద్యార్థులకు బహుమతులు అందించినట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ హరికిషన్, జయశీల గుప్తా తెలిపారు. సోమవారం అమ్మవారిశాలలో ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో అవోపా ప్రెసిడెంటు మాకం రంజిత్ కిరణ్, అవోపా కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు, అవోపా కోశాధికారి సేగు సుదర్శన్, సంఘం నాయకులు, ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటా: ఎమ్మెల్యే కోట్ల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డి

బేతంచెర్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సిమెంటునగర్ గ్రామంలోని పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ పునఃప్రారంభమయ్యే వరకు ఫ్యాక్టరీ కార్మికులకు అండగా ఉంటానని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం ఫ్యాక్టరీ గేట్ల ముందు కార్మికులు, నిరుద్యోగులు నిర్వహిస్తున్న ధర్నా శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా యజమాన్యంతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్మికులకు యాజమాన్యం ఇవ్వాల్సిన పెండింగ్ వేతనాలను ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించి ఫ్యాక్టరీ పునఃప్రారంభం కోసం తన వంతు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య, సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, పోలూరు రాఘవరెడ్డి, చంద్రశేఖర్, ఉన్నం సుధాకర్, మేకల నాగరాజు, రూబెన్, కార్మికులు, టీడీపీ నాయకులు రాముడు, ఉరుకుందు, వాసు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం పరిశీలన

సిమెంటునగర్‌లోని సచివాలయం-2ను ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం నిర్మాణంలో నిబంధనలు పాటించకుండా పనులు చేశారన్నారు. నిర్మాణంలో నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టరుపై తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.

- సిమెంటునగర్‌లో రేషన్ షాపును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రేషన్ వేశారు. అక్రమాలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని డీలర్‌ను హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాతిదూలం పోటీలు



రాతిదూలం పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు కాటసాని రామిరెడ్డి

చాగలమర్రి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపల్లెలో కోదండరామాలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలు సోమవారం హోరాహోరీగా సాగాయి. పోటీలను గ్రామ నాయకుడు కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు మొదటి బహుమతి రూ.60 వేలు, వరుసగా రూ.45 వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు నగదును అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

చాగలమర్రి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల ఉద్యోగులు యోగాసనాలు వేశారు. యోగాపై ఆసక్తి ఉన్న వారి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. మండలంలో కనీసం రెండు వేల మందికి పైగా యోగా నేర్పించాలనే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పీఆర్ఏఈ కొండారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో తాహిర్‌హుసేన్, ఆయాశాఖల ఉద్యోగులు ఉన్నారు.

డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): డెంగీ, మలేరియా వ్యాధులపై చెంచులు అప్రమత్తంగా ఉండాలని ఆళ్లగడ్డ మలేరియా సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని డి.వనిపెంట చెంచుగూడెంలో దోమల నివారణకు మొదటి విడత దోమల నివారణ మందును పిచికారి చేయించారు. ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, హెల్త్ అసిస్టెంట్లు రాముడు, మనోహర్, సంధ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

25 నీటి తొట్లు మంజూరు

చాగలమర్రి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా పశువుల దాహం తీర్చేందుకు 25 నీటి తొట్లు మంజూరయ్యాయని ఏపీవో ఖాసీం తెలిపారు. సోమవారం ఉపాధి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క నీటి తొట్టికి రూ.32వేలు మంజూరయ్యాయని అన్నారు. మండలంలోని డి.వనిపెంటలో ఆరు, ముత్యాలపాడులో నాలుగు, రాంపల్లె, బ్రాహ్మణపల్లె, గొట్లూరు, శెట్టివీడు గ్రామాల్లో ఒక్కొక్క నీటి తొట్టి మంజూరైందని అన్నారు.

ఆలయ భూములకు వేలం

శిరివెళ్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయలకుంట్ల గ్రామంలోని వివిధ ఆలయాలకు చెందిన 66.15 ఎకరాల భూములకు దేవాదాయశాఖ అధికారులు సోమవారం బహిరంగ కౌలు వేలం నిర్వహించారు. 2025-26 సంవత్సరానికిగాను ఏడాది కాల పరిమితితో నిర్వహించిన కౌలు వేలం ద్వారా రూ.15.45 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈవో రామాంజనేయశర్మ తెలిపారు. గత ఏడాది ఈ భూములకు రూ.14.03 లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాది రూ.1.42 లక్షలు ఆదాయం పెరిగిందన్నారు. నంద్యాల పరిధిలోని మూలసాగరం దేవాలయ ఈవో గోపి పర్యవేక్షణాధికారిగా వ్యవహరించారు.

భాస్కరనందీశ్వరాలయంలో...

రుద్రవరం: రుద్రవరం భాస్కరనందీశ్వరాలయంలో సోమవారం భాస్కరనందీశ్వర, ఆంజనేయ, దొర్నిలక్ష్మీనరసింహ దేవాలయ భూములకు కౌలు వేలం ఈవో సాయి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. తీవ్రపోటీ నెలకొనడంతో రూ.5.23లక్షలు ఆదాయం వచ్చింది. గత ఏడాది రూ.3.11లక్షలు ఆదాయం రాగా, ఈ ఏడాది అదనంగా రూ.2.12లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్‌వీ రంగనాయకులు, పోలా గురుమూర్తి, దేవాలయ నిర్వాహకులు ఏరువ క్రిష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

మాధవస్వామి ఆలయ భూములకు..

దొర్నిపాడు: మండలంలోని దొర్నిపాడు గ్రామంలో వెలసిన మాధవస్వామి, గణాధిపతి చౌడేశ్వరిదేవి ఆలయాలకు చెందిన భూములను సోమవారం కార్యనిర్వాహణాధికారి వీరయ్య ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఆలయాలకు చెందిన 70.28 ఎకరాలకు కౌలు వేలం నిర్వహించగా రూ.9.29లక్షల ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో బనగానపల్లె ఈవో బ్రహ్మారెడ్డి, చలపతి, అశోక్, రాష్ట్ర రైతు సంఘ అధ్యక్షుడు సిద్ధి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నారాయణ, బత్తుల నాగేశ్వరరావు, ఉసేని తదితరులున్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి

శిరివెళ్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిని నిర్మూలించేందుకు సమష్టిగా కృషి చేస్తున్నట్లు వైద్యుడు అంజనేయులు, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. టీబీ గుప్త అభియాన్ విస్తృత అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమ ప్రోగ్రామ్ అధికారి కాంతారావు నాయక్, పీహెచ్‌ఎన్ సరస్వతి, సూపర్‌వైజర్ రవికుమార్, టీబీ సూపర్‌వైజర్ శివ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆయకట్టు పన్ను రూ.2.80 కోట్లు బకాయిలు

రుద్రవరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం మండలంలో ఆయకట్టు పన్ను రూ.2.80కోట్లు ఉందని తహసీల్దారు మల్లికార్జునరావు సోమవారం తెలిపారు. ఇప్పటి వరకు రూ.7.58 లక్షలు గ్రామ రెవెన్యూ అధికారులు వసూలు చేశారన్నారు. మంగళవారం నుంచి గ్రామాల్లో గ్రామ రెవెన్యూ అధికారులు ఆయకట్టు పన్ను వసూలు చేయాలని సూచించారు. నిర్లక్ష్యం చేయొద్దని ఆదేశించారు.

పొదుపు సంఘాలకు రూ.52లక్షల రుణాలు

ఉయ్యాలవాడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఆయా గ్రామాల్లోని పొదుపు సంఘాలకు రూ.52 లక్షలు బ్యాంకు రుణాలు మంజూరు చేసినట్లు వెలుగు ఏపీఎం దాసన్న సోమవారం తెలిపారు. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన నాలుగు గ్రూపులకు రూ.45లక్షలు, పుచ్చకాయలపల్లె గ్రామానికి చెందిన రెండు గ్రూపులకు రూ.7లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. వీటిని జీవనోపాధి పెంపునకు ఉపయోగించుకోవాలని మహిళలకు సూచించారు.

ఆకట్టుకున్న కళాజాతా

చాగలమర్రి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో సోమవారం సాయంత్రం జిల్లా కళాజాత బృంద ప్రతినిధి శంభు ప్రసాద్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. ఆట,పాట ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైతన్య ఎడికేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సిబ్బంది, ఆళ్లగడ్డ ప్రాజెక్టు మేనేజర్ వరదనాచారి, కళాకారులు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే కఠినచర్యలు: సీఐ

కొలిమిగుండ్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలకు పాల్పడితే కఠినచర్యలు చేపడతామని సీఐ రమేష్‌బాబు హెచ్చరించారు. చింతలాయపల్లెలో ఘర్షణ జరిగిన నేపథ్యంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చిన్నచిన్న సమస్యలు ఏర్పడితే పోలీసుల, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు.

డోన్‌లో ముగ్గుల పోటీలు

డోన్ టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అంతకుముందు యోగా గురూజీ రాంపుల్లయ్య, కమిషనర్ ప్రసాద్‌గౌడు, యోగా మాస్టర్లు, మున్సిపల్ పార్కులో యోగాసనాలు చేశారు. అనంతరం మహిళల ముగ్గులను కమిషనర్ తిలకించారు.